www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 45 సంచిక : 14 విజయవాడ 20-11-2012 పేజీలు : 8 వెల : రు 5.00

లోపలి పేజీల్లో...

- పెటీ బూర్జువా సోషలిజం-శ్రామికవర్గ సోషలిజం-లెనిన్
- పని ప్రదేశాల్లో 'ప్రమాదాలు'
- వివిధ ప్రపంచ దేశాలలో కార్మికుల ఆందోళనలు
- రుణమాఫీ, సంక్షేమ పథకాలమాటున చేనేతను చిదిమివేస్తున్న పాలకులు

# దుర్భిక్షం-ముంపు పరిస్థితుల నివారణకు నిర్దిష్ట విధానాలు చేపట్టని పాలకులు

**రాష్ట్రంలో** సేద్యం అగమ్య గోచరంగా మారింది. సేద్యం చేసినా. చేయకపోయినా రైతాంగం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. సాగునీరు, రుణాలు, ఎరువుల ధరలు, చీడపీడలు, అతివృష్టి-అనావృష్టి, పెరిగిన సేద్యపు పెట్టుబడులు, పంటలకు న్యాయమైన ధర లభించక పోవటం, ఏ క్షణాన ఎలాంటి ఉపద్రవం జరుగుతుందోననే భయం నిరంతరం రైతులను పట్టి పీడిస్తున్నది. వీటికి తోడు గత మూడు సంవత్సరాలుగా ఏర్పడిన దుర్భిక్ష పరిస్థితులు, ఇటీవలి నీలం తుఫాను, ఆపై ముంపు; ఈ విపత్కర పరిస్థితులలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో సేద్యం ఎడల రైతాంగంలో విముఖత చోటు చేసుకొంటున్నది.

రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులను రైతాంగం ఎదుర్కొంటూ ఉంటే, పాలక ప్రభుత్వం వారిని ఆదుకొనే చర్యలు తీసుకోలేదు. ప్రతిపక్షపార్టీలు విమర్శలకే పరిమితమై చోద్యం చూస్తున్నాయి. రైతాంగ సమస్యలను అడ్డం పెట్టుకొని అధికారం చేజిక్కించుకొనేందుకు ఆరాట పడుతున్నాయి. పాలక పార్టీలు అందుకోసం అనేక వాగ్దానాలు చేస్తున్నాయి. రచ్చబండ, ఇందిరమ్మబాట పేరుతో ముఖ్యమంత్రి గ్రామాల పర్యటన, మీ కోసం వస్తున్నా చంద్రబాబు పర్యటన, షర్మిల మరో ప్రజాప్రస్థానం, ఒకరిపై ఒకరి విమర్శలు-పోటీపడి చేస్తున్న వాగ్దానాలు, రైతుల సమస్యలు పరిష్కరించటానికి కాదని, అధికారం కోసమేనని ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. యాభైఆరు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్-తెలుగుదేశం పార్టీలే తాము ఎదుర్కొంటున్న సంక్షోభానికి కారణమనే విషయాన్ని, పాలకుల మభ్యపర్చే ప్రయత్నాలనూ రైతాంగం గ్రహిస్తున్నారు. ఏ పాలకులైతే తమ సమస్యలకు కారణమో వారే వాటిని పరిష్కరిస్తామని చెప్పేమాటలు క్లలబొల్లికబుర్లనే వాస్తవం రైతాంగానికి తెలియందిగాదు.

రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల నుండి అనావృష్టి, కరువు పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. సాగునీరు అందించలేని పాలకులు సహాయక చర్యల్లోనూ మొండి చేయిచూపుతున్నారు.

ఆంధ్రరాష్ట్రంలో నాలుగు సంవత్సరాలకొకసారి అనావృష్టి పరిస్థితులు ఏర్పడుతూనే ఉన్నాయి. వాతావరణంలో ఏర్పడిన పరిణామాలు వలన వరస కరువులు కూడా కొనసాగుతున్నాయి. ఈ వాస్తవం తెలిసికూడా కరువు నివారణ చర్యలు చేపట్టటంలో ప్రభుత్వం ఉద్దేశ్యపూరిత వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. భారీ వర్షాలకు, వరదల వలనవచ్చే నీటిని నిల్వచేయటానికి రిజర్వాయర్లు, చిన్న, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టలేదు. వేలాదిగా ఉన్న చెరువులను మరమ్మత్తులు చేసి నీటిని నిల్వచేసే చర్యలు తీసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకొంటున్న జలయజ్ఞం ఆచరణలో పూర్తిగా వైఫల్యంచెందింది. ఒకటి-అర చిన్ననీటి పథకాలు తప్ప జలయజ్ఞం క్రింద చేపట్టిన ఏ సాగునీటి ప్రాజెక్టు పూర్తికాలేదు. యాభైవేల కోట్లరూపాయలు ఖర్చుచేసినా రైతులకు అదనంగా సాగునీరు అందిందిలేదు. కేటాయించిన డబ్బులు ప్రాజెక్టులకు ఖర్చు చేయటంకన్నా మంత్రుల, అధికారుల, కాంట్రాక్టర్ల జేబులు నింపటానికే ఉపయోగపడింది. పెద్దఎత్తున కుంభకోణాలు జరిగాయి. ఫలితంగా ప్రతి సంవత్సరం వేలాది టి.యం.సి.ల నీరు వృధాగా సముద్రం పాలౌతున్నది. ఆ నీటిని నిల్వచేసే పనులు పూర్తిచేసి ఉంటే రాష్ట్రంలో కరువు పరిస్థితి ఇంత తీవ్రంగా ఉండేది కాదు. సమర్థవంతంగా దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొనే పరిస్థితి ఉండేది. అందువలన కరువు పరిస్థితులు ఏర్పడటానికి ప్రకృతి ఒక కారణంగా ఉన్నా, ప్రధాన కారణం పాలకవర్గాలేనన్న వాస్తవాన్ని విస్మరించలేము.

2005, 2007, 2010లో అతివృష్టి, మిగతా సంవత్సరాల్లో అనావృష్టి రాష్ట్రంలో సంభవించి రైతులు పంటలు కోల్పోయారు.

రాష్ట్రంలో కోటీ 20 లక్షల రైతు కుటుంబాలు ఉన్నాయి. అందులో 80% చిన్న, సన్నకారు రైతు కుటుంబాలేనని అనేక సర్వేలు వెల్లడించాయి. రాష్ట్రంలో 275.4 లక్షల హెక్టార్లు భూములు ఉండగా అందులో 128.20 లక్షల హెక్టార్లను సాగుభూములుగా ప్రభుత్వం గుర్తించింది. ఇందులో 78.25 లక్షల హెక్టార్లు ఖరీఫ్‌లోనూ, 40.44 హెక్టార్లు రబీలోనూ సాగవుతున్నట్లు ప్రభుత్వ లెక్కలు తెలియచేస్తున్నాయి. సేద్యభూముల విస్తీర్ణాన్ని పెంచాలనే ఆలోచన ఉన్న పాలకులైతే ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా సేద్యంలో లేని భూములకు నీరు అందించేవారు. గత సంవత్సరం అనుకూల, అననుకూల పరిస్థితుల మధ్య సేద్యం జరిగింది. జూన్ నుండి ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా దుర్భిక్ష పరిస్థితి ఏర్పడి రాష్ట్రంలో 878 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. వేలాది ఎకరాల పంటలు ఎండిపోయాయి. కరువు సమస్యకు తోడు ఖరీఫ్ పంట చేతికి వచ్చే సమయంలో భారీవర్షాల వలన ముంపు ఏర్పడి 35% విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయి. 20 శాతం విస్తీర్ణంలో చేతికి వచ్చిన పంటలను రైతాంగం పూర్తిగా నష్టపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో 40.44%గా ఉన్న రబీ సాధారణ విస్తీర్ణంలో 10% సేద్యం తగ్గిపోయింది. అందుకు కారణం ప్రకృతి వైపరీత్యాలు, పంటలకు న్యాయమైన ధరలు లభించకపోవటమే! మొత్తం సీజన్‌లో 34,24,156 హెక్టార్లలో పంట నష్టం జరగగా, 51,53,667 మంది రైతులు నష్టానికి గురైనారు. కరువుమండలాలుగా గుర్తించిన ప్రాంతాల్లో 20,98,516 మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులకు నష్టం వాటిల్లింది. వాటి విలువ 5,748.67 వేల కోట్ల రూపాయలుగా అధికారులు లెక్కలు గట్టారు. **(చూడండి-పట్టిక:1)** వాస్తవ పరిశీలనలో ఈ నష్టం ఇంకా ఎక్కువగా ఉంటుంది.

కరువు మండలాల్లో నష్టాలు అంచనా వేయటానికి రాష్ట్రప్రభుత్వానికి 45 రోజులు పట్టింది. జిల్లా నుండి అందిన ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకొని, నివేదికలు రూపొందించటానికి విపత్తుల నిర్వహణ శాఖకు మరో నెలరోజులు పట్టింది. కనుక, నష్టం అంచనా వేయటానికే దాదాపు మూడు నెలలు పట్టిందంటే, రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలు సహాయక చర్యలు చేపట్టటంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించిందీ అర్థమౌతుంది.

ప్రభుత్వ అంచనాల ప్రకారం నష్టపోయిన ప్రజలను, రైతులను ఆదుకోవటానికి 26వేల కోట్ల రూపాయలు అవసరం కాగా, ఇందులో 1,896.38 కోట్లను వ్యవసాయ పంటల నష్టానికి, 26.99 కోట్లు ఉద్యానపంటల నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఇవ్వవలసిందిగా, ఇంకా వివిధ రంగాలకు జరిగిన నష్టం కోసం కూడా సహాయం అందించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. సహాయం కోసం ఎన్ని విజ్ఞప్తులు చేసినా కేంద్రం స్పందించలేదు. రాష్ట్ర ప్రభుత్వం, తన ఖజానా నుండి నిధులు విడుదల చేసి సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధపడలేదు. ఈ విధంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కరువు-ముంపు బారిన పడిన రైతులను, ప్రజలను గాలికి వదిలివేశారు. ఇస్తామని చెప్పిన ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇంతవరకు రైతాంగానికి అందలేదు. అదిగోఇదిగో అంటూ రైతాంగాన్ని మభ్యపెడుతున్నారు.

2011లో ఏర్పడిన దుర్భిక్ష పరిస్థితులు, ముంపునుండి తేరుకోని రైతాంగానికి 2012 ఖరీఫ్ సీజన్‌లో కూడా అదే పరిస్థితి ఎదురైంది. జూన్ నుండీ నమోదు కావాల్సిన వర్షపాతం నమోదు కాకపోవటంతోపాటు ప్రభుత్వ విధానాల ఫలితంగా రిజర్వాయర్లలోని నీరు అడుగంటి, సాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ఒకవైపు నెర్రెలు బారుతున్నభూములు, మరొకవైపున వేసిన పైర్లు ఎండిపోతున్న దృశ్యం. సాగర్-కుడి ఎడమ కాల్వలక్రింద 23 లక్షల ఎకరాల్లో సేద్యం సాగలేదు. రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లోను, నెల్లూరు, ప్రకాశం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో వేలాది ఎకరాల్లో సేద్యం జరగలేదు. క్రిష్ణా డెల్టాలోనూ సాగునీటి సమస్య ఏర్పడి ఆలస్యంగా నాట్లుపడ్డాయి. చివరి భూములకు నీరు అందలేదు. కాల్వల ద్వారా నీరు లభించకపోవటం వలన ఇంజన్ల ద్వారా నీరు పెట్టి, వేసిన పైర్లను కాపాడే ప్రయత్నం చేశారు. అనేక పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో వరి పంట 26.48 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 21.63 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. 2010 సం॥లలో 25.87 లక్షల హెక్టార్లు సాగు కాగా, 2012లో 25 లక్షలకు తగ్గిపోయింది. పెసర, మినప, కంది తదితర పప్పు దినుసుల పంట విస్తీర్ణం 8.10 లక్షల హెక్టార్ల నుండి 6 లక్షల హెక్టార్లకు పరిమితమైంది. వేరుశనగ పంటల విస్తీర్ణం 13 లక్షల హెక్టార్ల నుండి వర్షాభావ పరిస్థితుల వలన 10 లక్షల హె.మాత్రమే సాగైంది. నూనెగింజల పంటలు 17.62 లక్షల హె.సాగు కావాల్సిఉండగా 14 లక్షల హెక్టార్లు మాత్రమే సాగైంది. లక్షా 69 వేల హె.మిర్చి పంట సేద్యం జరగాల్సి ఉండగా 88వేల హె.కు పరిమితమైంది. పసుపు, చెరకు, ఉల్లి పంటల విస్తీర్ణంకూడా సాధారణ సాగుకన్నా 30% తగ్గిపోయింది. **(చూడండి-పట్టిక:2)**

పట్టిక-2ను పరిశీలిస్తే 2009-12 మధ్య వరిపంట విస్తీర్ణం లక్ష హెక్టార్లకుపైగా తగ్గగా పప్పుదినుసుల పంటల విస్తీర్ణం 2010,2012 సం॥లో కొద్దిగా **(తరువాయి 2వ పేజీలో)**

ప్రకటన

## ఉద్దేశ్యపూరిత ప్రభుత్వ నిర్లక్ష్యమే, ముంపు తీవ్రతకు కారణం! బాధితులందరికీ ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలి!

**నీలం** తుఫాన్ రాష్ట్రంలోని కోస్తా జిల్లాలను అతలాకుతలం చేసింది. అధికారిక లెక్కల ప్రకారమే 40మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. పేదలకు చెందిన వేలాది ఇళ్ళు నేలకూలాయి. చేతికి అందాల్సిన పంటలు నీటమునిగి నాశనమైనాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 13 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ముఖ్యంగా వరి, పత్తి, మెట్ట పైర్లకు అపారంగా నష్టం వాటిల్లింది. వందలాది చెరువులకు గండ్లు పడ్డాయి. అనేక గ్రామాలు నీట మునిగాయి. జలదిగ్బంధంలో ఉన్న ప్రజలు ఆహారంకోసం, మంచినీటికోసం హాహాకారాలు చేస్తున్నారు. దుర్భిక్ష పరిస్థితులవలన ఇప్పటికే పంటలు కోల్పోయిన రైతాంగం, నీలం తుఫాను దెబ్బతో నిలువునా కూలిపోయారు; దిక్కుతోచని పరిస్థితికి నెట్టబడ్డారు.

నీలం తుఫాను తీరందాటిన తర్వాత కూడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించినా ప్రభుత్వం-అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరించారు. ఎటువంటి ముందు జాగ్రత్త చర్యలూ తీసుకోలేదు. ప్రకటనలకే పరిమితమైనారు. తుఫాను తీరం దాటిన తర్వాత రాష్ట్రానికి తుఫాను ముప్పు తప్పిందని, స్వల్పంగానే నష్టం జరిగిందని రెవిన్యూమంత్రి ప్రకటించటం ప్రభుత్వ ఘోర నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తున్నది.

కోస్తా జిల్లాల్లో ముంచెత్తిన నదులన్నీ చిన్నవే. అలాగే వాగులు, వంకలు వున్నాయి. పెద్ద నదులనుండి ఈసారి ముంపు ప్రమాదం ఏర్పడలేదు. ఇంతగా ముంపు ఏర్పడటానికి నదులు, వాగులు, వంకల నిర్వహణ అధ్వాన్న పరిస్థితిలో వుండటమే కారణం. వాటి మరమ్మత్తుల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. నదులకు, వాగులకు, మురుగు కాల్వలకు మరమ్మత్తులు చేసి వుంటే ఇప్పుడు వచ్చిన ముంపు చాలావరకు నివారించబడి వుండేది. ప్రకృతిమీదకు తోసేసి చేతులు దులుపుకోజూస్తున్న ప్రభుత్వమే, ముంపుకు బాధ్యత వహించాలి.

అపారంగా నష్టంవాటిల్లిన తర్వాత మాత్రమే ప్రభుత్వం ముంపు గురించి మాట్లాడటం ప్రారంభించింది. ప్రజలను ఆదుకొంటానని ప్రకటనలు చేస్తున్నది. పునరావాసం సంగతి అట్లావుంచి, రోజుల తరబడి నీటిముంపులో చిక్కుకున్న ప్రజలు కనీస ఆహారంకోసం, మంచినీటికోసం ఆర్తనాదాలు చేసే దయనీయపరిస్థితులు గమనిస్తే, ప్రభుత్వ ఉద్దేశ్యపూరిత నిర్లక్ష్యం స్పష్టమవుతుంది.

ముంపు సృష్టించిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వమే దానికి బాధ్యత వహించి బాధితులకు ఈ క్రింది సహాయక చర్యలు వెంటనే చేపట్టాలి.

- మృతుల కుటుంబాలకు 5 లక్షలు పరిహారం చెల్లించాలి.
- ఇళ్ళు కోల్పోయిన వారికి తిరిగి ఇళ్ళు కట్టుకోవటానికి పూర్తి నష్ట పరిహారం ఇవ్వాలి.
- పంట నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు అయిన పూర్తి పెట్టుబడిని తిరిగి ఇవ్వాలి. కౌలురైతులతో సహా సన్న, చిన్నకారు రైతుల రుణాలు రద్దుచేయాలి.
- జలదిగ్బంధంలో వున్న ప్రజలకు ఆహారం, మంచినీరు తక్షణం అందించాలి.
- అంటురోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి.
- చెరువులకు, రోడ్లకు పడిన గండ్లను యుద్ధప్రాతిపదికపై మరమ్మత్తులు చేయాలి; శాశ్వత సక్రమ నిర్వహణ చర్యలు చేపట్టాలి.
- వరదనీటిని నిల్వచేసే ప్రాజెక్టుల నిర్మాణం చేయాలి. వాగులు, వంకలు, మురుగుకాల్వలకు మరమ్మత్తులు చేపట్టాలి.
- వ్యవసాయ కూలీల కుటుంబాలకు 10వేల ఉచిత ఆర్థిక సహాయం, 50 కేజీల బియ్యం, ఇతర నిత్యజీవితావసర వస్తువులు అందించాలి.
- మగ్గాల్లో నీరుచేరి నష్టపోయిన, బోట్లు, వలలు నష్టపోయిన చేనేత, మత్స్యకార్మికులకు; ఇతర చేతివృత్తుల వారందరికీ కోల్పోయిన పనిదినాలకు, జరిగిన నష్టానికి పరిహారాన్ని చెల్లించాలి.

**విజయవాడ** **(యస్. ఝాన్సి)** **(కె. కోటయ్య)**
**6-11-12** రాష్ట్ర అధ్యక్షులు రాష్ట్ర కార్యదర్శి

**పట్టిక:1 గత సంవత్సరం ఖరీఫ్-రబీ సీజన్లలో జిల్లాల వారీగా జరిగిన నష్టం ఈ విధంగా ఉంది.**

| కరువు జిల్లా | నష్టపోయిన రైతులు | నష్టపోయిన పంటల విస్తీర్ణం(హె.లో.) | నష్టపోయిన ఉత్పత్తులు(మి.ట) | నష్టపోయిన విలువ (రూ.కోట్లలో) |
|---|---|---|---|---|
| శ్రీకాకుళం | 1,12,230 | 39,994 | 62,669 | 67.76 |
| విజయనగరం | 80,023 | 26,020 | 38,232 | 45.81 |
| విశాఖపట్నం | 1,26,943 | 34,226 | 59,922 | 47.12 |
| తూర్పుగోదావరి | 46,163 | 19,103 | 23,465 | 33.64 |
| పశ్చిమగోదావరి | 5,706 | 2,716 | 4,022 | 4.61 |
| కృష్ణా | 84,477 | 50,778 | 47,752 | 107.75 |
| గుంటూరు | 1,04,273 | 68,048 | 49,752 | 149.25 |
| ప్రకాశం | 13,258 | 8,048 | 49,752 | 149.25 |
| కర్నూలు | 4,15,890 | 3,08,978 | 1,79,428 | 419.68 |
| అనంతపురం | 6,71,012 | 7,26,619 | 4,05,831 | 989.51 |
| చిత్తూరు | 2,20,208 | 1,26,210 | 64,619 | 174.47 |
| కడప | 33,273 | 28,047 | 15,780 | 38.44 |
| రంగారెడ్డి | 2,81,664 | 1,28,085 | 1,42,870 | 190.55 |
| మహబూబ్‌నగర్ | 8,88,179 | 5,64,123 | 5,98,122 | 466.36 |
| నల్గొండ | 2,76,796 | 2,33,142 | 2,08,262 | 406.76 |
| వరంగల్ | 8,89,414 | 1,95,444 | 1,96,262 | 408.72 |
| ఖమ్మం | 2,96,789 | 1,87,437 | 1,75,857 | 391.47 |
| కరీంనగర్ | 1,78,958 | 1,16,917 | 83,368 | 391.47 |
| మెదక్ | 4,00,327 | 2,25,301 | 4,61,411 | 384.36 |
| నిజామాబాద్ | 16,806 | 9,230 | 6,922 | 20.76 |
| అదిలాబాద్ | 4,13,227 | 3,23,870 | 2,60,009 | 117.32 |

**ఆధారం : ఆంధ్రప్రభ, 3-10-12**

## దుర్భిక్షం-ముంపు... (మొదటి పేజీ తరువాయి)

(మొదటి పేజీ తరువాయి)

పెరిగినట్లు కనిపిస్తున్నా అందుకు అనుగుణంగా దిగుబడులు పెరగలేదు. నూనెగింజల విస్తీర్ణం పెరుగుదల, దిగుబడి అదేవిధంగా ఉన్నాయి. ఇందుకు ప్రధాన కారణం, పాలకులు పంటలకు న్యాయమైన ధర యివ్వకపోవటం, సాగునీరు, ముంపు నివారణ చర్యలు తీసుకోక పోవటమే!

గత సంవత్సరం 887 మండలాల్లోనూ, ఈ సంవత్సరం 362 మండలాల్లోనూ దుర్భిక్షంతో పాటు కరువు పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ పేదలు, రైతాంగం కరువువాతపడి గిలగిలలాడారు.

రోజురోజుకీ కుంచించుకుపోతున్న ఉపాధి అవకాశాలు దుర్భిక్ష పరిస్థితుల వలన మరింతగా దిగజారి వ్యవసాయ కూలీలకు పనులు కరువయ్యాయి. వారి కుటుంబాలు గడవటమే గగనమై పిల్లలతో సహా ఆకలి దప్పులకు గురౌతున్నారు. ప్రాణాలు నిలబెట్టుకొనేందుకు జన్మనిచ్చిన ఊరు వదిలి, పిల్లలను చంకజోలిలో పెట్టుకొని, ఉన్న కొద్దిపాటివంటి పాత్రలను నెత్తిన పెట్టుకొని పట్టణాలకు, ఇతర రాష్ట్రాలకు వలసలుపోయి, అక్కడ మరింత నికృష్టమైన జీవితాలు గడుపుతున్నారు.

త్రాగునీరు, మేతలేక పశుపోషణ రైతులకు భారంగా మారింది. తమ కళ్ళముందే మేతలేక ఉసూరుమంటుంటే చూడలేక, గత్యంతరం లేక బరువెక్కిన గుండెలతో వాటిని కబేళాలకు తరలిస్తున్నారు. ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ఉన్న ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తిన తర్వాతే కేంద్రానికి నివేదికలు అందజేసింది. దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కోవటానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ప్రకటనలు చేయటం తప్ప సహాయక చర్యలు చేపట్టటంతో పూర్తిగా వైఫల్యం చెందింది. త్రాగునీటి కోసం మాత్రమే 20 కోట్లు విడుదలచేసి చేతులు దులుపుకొన్నది. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించి వలసలను నివారించటంలో వైఫల్యం చెందింది. రైతాంగానికి గత సం॥, ఈ సంవత్సరం పంటల నష్టానికి యిస్తామన్న ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం అదిగో, ఇదిగో అనటం తప్ప ఆచరణలో అమలు జరగలేదు. ఇచ్చినా బ్యాంకులకు జమ చేస్తామంటున్నది. అలా చేస్తే రైతులకి యిచ్చిన అప్పుక్రింద బ్యాంకులు జమచేసుకొంటాయి. అందువలన ఆపదలో ఉన్న రైతులకు అవసరానికి ఉపయోగపడదు. కరువు ప్రాంతాల్లో తాగునీటి సమస్యను కూడా ప్రభుత్వం తీర్చలేకపోయింది. కేంద్రం నిధులు విడుదల చేస్తేనే సహాయ చర్యలు చేపడతాననే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం వేలకోట్లు సహాయం అర్థిస్తే కేంద్రం ఎంగిలి మెతుకులు విదిలించినట్లు నిధులను కేటాయిస్తున్నది. ఈ విధంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ పేదల, రైతుల జీవితాలతో ఆడుకొంటున్నాయి.

## ముంచెత్తిన నీలం తుఫాన్

గతమూడు సంవత్సరాలుగా దుర్భిక్షానికి, ముంపుకి గురౌతూ తీవ్రంగా నష్టపోయిన రైతాంగం మీద ప్రకృతి నీలం తుఫాన్ రూపంలో మరోసారి విరుచుకు పడింది. ఈ తుఫాన్ బీభత్సానికి కోస్తా జిల్లాలతోపాటు, ఖమ్మం జిల్లా కూడా అపారనష్టానికి గురైంది. 20 లక్షల ఎకరాల్లోని చేతికి అందివచ్చిన, అందబోయే పంటలు నీటి మునిగాయి. సేద్యానికి రైతులు పెట్టిన పెట్టుబడి, పడ్డశ్రమ ముంపు నీటిలో కొట్టుకు పోయింది. ఫలితంగా కోలుకోని విధంగా రైతాంగం నవనాడులను కుంగదీసింది. 44 మంది ప్రాణాలను ఈ నీలం తుఫాన్ బలితీసింది. 18 వేల దాకా పేదల ఇండ్లను నేలకూల్చింది. 17,286 పౌల్ట్రీఫారాలు దెబ్బతిన్నాయి. 1905 చెరువులకు గండ్లు పడ్డాయి. వేలాది కిలోమీటర్లమేర పట్టణ-గ్రామీణ ప్రాంతాల రోడ్లు దెబ్బతిన్నాయి. మున్సిపల్ వాటర్ సప్లయ్‌లైన్లు 495 దెబ్బతిన్నాయి. వ్యవసాయ కూలీలు, చేనేత కార్మికులు ఉపాధిని కోల్పోయారు. వేలాది మగ్గాలు నీటమునిగాయి. ముఖ్యంగా గుంటూరు, క్రిష్ణా, ఉభయ గోదావరులు, విశాఖ, శ్రీకాకుళం, ఖమ్మం జిల్లాల్లో అపారంగా నష్టం వాటిల్లింది.

**శ్రీకాకుళం జిల్లాలో** తుఫాన్ వలన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 38,244 హెక్టార్లులో పంటలు నీటమునిగాయి. 130 ఇళ్లు పూర్తిగాను 1245 ఇళ్లు పాక్షికంగాను దెబ్బతిన్నాయి. 49 సాగునీటి పథకాలకు గండ్లుపడ్డాయి. 409 చిన్న నీటి కాలువలు, చెరువులకు గండ్లు పడ్డాయి. 184.2 కి.మీ. మేర రోడ్లు దెబ్బతిన్నాయి. **విజయనగరం జిల్లాలో** 13,604 హె. వ్యవసాయపంటలు, 294 హె. ఉద్యానవన పంటలకు నష్టం జరిగింది. ఐదుగురు మరణించారు. 325 ఇళ్లు పూర్తిగాను, 595 ఇళ్లు పాక్షికంగాను దెబ్బతిన్నాయి. నాలుగు ప్రధాన చెరువులకు గండ్లు పడ్డాయి. 125 బోట్లు, వలలు పనికి రాకుండాపోయాయి. 39 చేపల చెరువులకు నష్టం జరిగింది. **విశాఖపట్నం జిల్లాలో** 55,554 హె. వ్యవసాయ, 545.2 హె. ఉద్యానవన పంటలు నీటమునిగాయి. 379 ఇళ్ళు పూర్తిగాను, 1,616 ఇళ్లు పాక్షికంగాను దెబ్బతిన్నాయి. 424 పశువులు, 10 వేలకు పైగా కోళ్ళు మరణించాయి. 435 బోట్లు, వలలు దెబ్బతిన్నాయి. 228 కి.మీ. మేరకు రహదారులు దెబ్బతిన్నాయి. **తూర్పుగోదావరి జిల్లాలో** 2,27,119 హె. వ్యవసాయ పంటలు, 3915 హె. ఉద్యానవన పంటలు నీటమునిగి అపారమైన నష్టం జరిగింది. 9 మంది ప్రాణాలు కోల్పోయారు. 1300 ఇళ్ళకు పూర్తిగాను, 3829 ఇళ్ళకు పాక్షికంగాను నష్టం జరిగింది. 376 పశువులు, 5,586 కోళ్ళు మరణించాయి. 545 బోట్లు, వలలు, పాడైనాయి. 15 చేపల పెంపక కేంద్రాలు, 43 చిన్ననీటి వనరులు దెబ్బతిన్నాయి. **పశ్చిమగోదావరి జిల్లాలో** 1,45,313 హె. వ్యవసాయ పంటలు, 3,686 హె. ఉద్యానవన పంటలు నీటమునిగి పెద్ద నష్టం జరిగింది. పదిమంది ప్రాణాలు కోల్పోయారు. 450 ఇళ్లు పూర్తిగా, 3673 ఇళ్ళు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 103 సాగునీటి కాల్వలకు నష్టం జరిగింది. 553 కిలోమీటర్ల రహదారులు దెబ్బతిన్నాయి. 1244 కరెంటు లైన్లు పాడైనాయి. **క్రిష్ణా జిల్లాలో** 92,852 హె. ఆహార పంటలు, 2876 హె. ఉద్యానవన పంటలు ముంపుకి గురైనాయి. ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పూర్తిగా 428 ఇళ్ళకు, పాక్షికంగా 1,840 ఇండ్లకు నష్టం జరిగింది. మత్స్యకారులు, చేనేత వృత్తివారు తీవ్రంగా నష్టపోయారు. సాగునీటి వనరులు దెబ్బతిన్నాయి. **గుంటూరు జిల్లాలో** 68,196 హె. ఖరీఫ్ పంటలు, 9,723హె. ఉద్యానవన పంటలు పాడైనాయి. ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 13 గ్రామాలలో నీటిపారుదల ట్యాంకులకు గండ్లుపడ్డాయి. 55 సాగునీటి కాల్వలు దెబ్బతిన్నాయి. **ఖమ్మం జిల్లాలో** వేలాది హెక్టార్లలో పంటలు దెబ్బ తిన్నాయి. నలుగురు అసువులు బాశారు. 65 ఇళ్ళు పూర్తిగా దెబ్బతిన్నాయి. 3వేల కోళ్ళు మరణించాయి. 59 చిన్ననీటి పారుదల వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఇంకా వరంగల్, కరీంనగర్, మెదక్, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోను తీవ్రమైన నష్టం సంభవించింది.

నీలం తుఫాన్ వలన నమోదు అయిన వర్షపాతాన్ని గమనిస్తే అతి ప్రమాదకరస్థాయిలో వర్షపాతం నమోదు కాకపోయినా నష్టం అపారంగా జరిగింది. అందుకు ప్రధాన కారణం అధ్వాన్నమైన మురుగునీటి వ్యవస్థే. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు, మురుగునీరు పారుదల సౌకర్యం కల్పించినప్పుడే ముంపు ప్రమాదాన్ని తగ్గించటం సాధ్యమౌతుంది. ప్రకాశం, ధవళేశ్వరం ఆనకట్టలు నిర్మించిన కాటన్ అందుకు అనుగుణంగా మురుగునీటి కాల్వలను నిర్మించాడు. ఆ తర్వాత బ్యారేజీలుగా అవి నిర్మితమైనాయి. ఫలితంగా సేద్యం పెరిగింది. అందుకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడలేదు. ధవళేశ్వరం బ్యారేజీ క్రింద మురుగునీటి వ్యవస్థ నామమాత్రంగానే వుంది. ప్రకాశం బ్యారేజీ క్రింద సాగయ్యే క్రిష్ణా డెల్టాలో తగినన్ని మురుగు కాల్వలు ఉన్నా పాలకుల విధానం ఫలితంగా అవి అధ్వాన్నంగా మారాయి. మరమ్మత్తులు లేక పూడికలు వేసి భారీ వర్షాలకు పొంగి పొర్లుతున్నాయి. రైతాంగ ప్రయోజనాలు పట్టని పాలకులు, డ్రైనేజీ వ్యవస్థను గాలికి వదిలివేశారు. 1965లో వచ్చిన తుఫాన్, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నస్థితిని బయటపెట్టింది. నిండువేసవిలో వచ్చిన తుఫాన్ గ్రామాలను, పొలాలను ముంచెత్తింది. డ్రైనేజీ వ్యవస్థను యుద్ధప్రాతిపదిక మరమ్మత్తులు చేపట్టాలనే ఆందోళన ప్రారంభమైంది.

ఈ ఆందోళన నేపథ్యంలో 1968లో రాష్ట్రప్రభుత్వం డ్రైనేజీ బోర్డును ఏర్పాటు చేసింది. దీని వలన అధికార పార్టీ వారికి పదవులు దక్కాయే తప్ప, కాల్వల మరమ్మత్తులు జరగలేదు. మరమ్మత్తుల విషయంలో పాలకులు రూపొందించిన నిబంధనలు డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ఉపయోగపడలేదు. మేజర్ డ్రైన్లు 12 సం॥, మైనర్ డ్రైన్లు 6 సం॥ వరకు మరమ్మత్తులు చేయరాదన్నది ఆ నిబంధనలు. దీంతో కాల్వల్లో పూడికలు పెరగటంతోపాటు తూటికాడ, గురప్రుడెక్క కాల్వలను పెనవేసి మురుగునీటిని అడ్డుకొంటున్నాయి.

కాల్వల మరమ్మత్తుల కోసమని కాంగ్రెస్ ప్రభుత్వం 1969-78 వరకు డ్రైనేజీ సెస్‌ను వసూలు చేసింది. ఈ సెస్సు క్రింద గుంటూరు జిల్లాలోని పశ్చిమక్రిష్ణా డెల్టాలోనే 49 కోట్లు వసూలు చేసింది. రైతాంగం నుండి వసూలు చేసి ఈ డబ్బును మురుగుకాల్వల మరమ్మత్తుకు ఉపయోగించకుండా, దాన్ని దారిమళ్లించటమో, జేబులు నింపుకోవటమో చేశారు. 1983లో తెలుగుదేశం ప్రభుత్వం డ్రైనేజీ సెస్సుని పునరుద్ధరించి 30 రూ॥ పెంచారు. 1997లో తిరిగి రద్దుచేశారు.

పాలకుల విధానాల ఫలితంగా డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా మారింది. గుంటూరు జిల్లాలోని నల్లమడ, రేపల్లె, భట్టిప్రోలు మెయిన్ డ్రైన్లు, క్రిష్ణా జిల్లాలో కొల్లేరు సరస్సు, బుడమేరు, గుండేరు, పశ్చిమ గోదావరి జిల్లాలో ఎండమూరు, ఎర్రకాల్వ, కొవ్వాడ, తమ్మిలేరు, ఉప్పుటేరు డ్రైన్లు మరియు అనేక చిన్న డ్రైన్లు భారీ వర్షాలకు, తుఫాన్, వరదలకు పొంగిపొర్లి గ్రామాలను, పైర్లను ముంచెత్తి అపారమైన నష్టాన్ని కలుగచేస్తున్నాయి. వరదలు, ముంపు ఏర్పడినప్పుడల్లా కాల్వల ఆధునీకరణ గురించి మాట్లాడటం, అరకొరగా నిధులు కేటాయించి తూతూ మంత్రంగా పనులు చేయటం, ఆ తర్వాత పట్టించుకోక పోవటం పాలకులు తమ విధానంగా అనుసరిస్తూ వస్తున్నారు.

1977 ఉప్పెన, 1979 నాటి భయంకర తుఫాను, ఆ తర్వాత కాలంలోని అనేక తుఫాన్లు-మురుగునీటి కాల్వల, పంటకాల్వల, కరకట్టల అధ్వాన్న పరిస్థితి కళ్ళముందుంచుతున్నా పాలకులకు పట్టలేదు. 2006లో వచ్చిన భారీవర్షాలు, వరదలవలన సంభవించిన భారీ నష్టంతో కాల్వలను, కరకట్టలను ఆధునీకరించాలనే డిమాండ్ తిరిగి ముందుకు వచ్చి పాలకులను నిలదీయటంతో, నాగార్జున సాగర్ ఆయకట్టను 4444 కోట్లతోను, క్రిష్ణా డెల్టాను 4573 కోట్లతో ఆధునీకరిస్తానని, అందుకోసం ప్రపంచబ్యాంక్ రుణం తీసుకొంటానని 2007లో ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచబ్యాంక్ ఆమోదం మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, అది విధించిన షరతులను ఆమోదించింది. సాగునీటి వ్యవస్థను రెండుగా విభజించి, నీటిని స్థిరీకరించి, కాల్వలకు మీటర్లు బిగించి రైతులకు సాగునీటిని అమ్మటానికి ప్రభుత్వం చకచకా చర్యలు తీసుకొంటున్నది.

సాగర్-క్రిష్ణా డెల్టాల ఆధునీకరణ చేపట్టి ఐదు సంవత్సరాలు కావస్తున్నా అందుకు సంబంధించిన పనులు నామమాత్రంగానే జరిగాయి. ఆధునీకరణకు సంబంధించిన పనులన్నీ, ప్రపంచబ్యాంక్ కనుసన్నల్లో, దాని ఆమోదం మేరకు ప్రారంభించాల్సి రావటమే అందుకు కారణం. అందువలన ఆధునీకరణ పనులు ఎప్పటికి పూర్తి అవుతాయో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. రైతాంగం మాత్రం ప్రతి సంవత్సరం ముంపుకి-దుర్భిక్షానికి గురౌతూనే వున్నారు.

నేడు నీలం తుఫాన్ వలన సంభవించిన అపార నష్టానికి కూడా అధ్వాన్నమైన డ్రైనేజి వ్యవస్థ కారణం. దానికి తోడు జలయజ్ఞం పేరుతో పోలవరం ప్రాజెక్టు నీటి విడుదలకోసం త్రవ్విన కాల్వల మట్టిని గుట్టలు, గుట్టలుగా పడవేయటం మూలంగా మురుగునీరు పోయే అవకాశం లేక తాండవ, గోస్తనీ, పంపానదులు ఉప్పొంగి గ్రామాలను, పంటపొలాలను ముంచెత్తాయి. విజయవాడ లోని బుడమేరు డ్రైన్, విశాఖ-విజయనగరం జిల్లాల్లోని అనేక వాగులు ఉప్పొంగాయి. నాలుగు-ఆరు-ఎనిమిది లైన్లుగా విస్తరించుకుంటూపోతున్న జాతీయ రహదారులను నీటివాలుకు (కాంటూర్‌లకు) అడ్డుగా నిర్మించటం, నీరుపోయే ఖానాలను నిర్మించకపోవటంతో కొద్దివర్షాలకు కూడా రోడ్లు కోతలకు గురవుతున్నాయి; గ్రామాలను, పంటలను నీళ్ళు ముంచెత్తుతున్నాయి.

పై వాస్తవాలను గమనించినప్పుడు ఇంతకు ముందువచ్చిన వరదలకు, ముంపుకి, నేటి ముంపుకి పాలకులే ప్రధాన కారకులు. అందువలన సంభవించిన నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. సహాయక చర్యలు చేపట్టాలి. కానీ నీలం తుపాన్, ముంపు వచ్చి రోజులు గడుస్తున్నా సహాయక చర్యలు ఇంతవరకు చేపట్టలేదు. సర్వేద్వారా నష్టాలను అంచనావేసి ఇన్‌పుట్ సబ్సిడీ-పంటల బీమా పరిహారం అందచేస్తామని పాత పాటే పాడుతున్నది. ఇది కూడా కేంద్రం సహాయం అందిన తర్వాతే అమలుజరుపుతామంటున్నది. అది కూడా రైతుల బ్యాంక్ ఖాతాలకు జమచేస్తానని చెప్పి, ఆపదలో ఉన్న రైతుల అవసరాలకు నామమాత్రం సహాయం కూడా ప్రత్యక్షంగా అవకాశం లేకుండా చేస్తున్నది.

రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులకు కారకులైన పాలకులు, కష్టంలో ఉన్న ప్రజలను ఆదుకోవటం బాధ్యతగా తీసుకోవటంలేదు. సహాయం పొందటం ప్రజల హక్కుగా గుర్తించకుండా వారిని బిక్షగాళ్ళగా మార్చే పరిస్థితి కల్పిస్తున్నారు. ఇలాంటి పాలకులు ఉన్నంత వరకు ఆపదలో ఉన్న, నష్టపోయిన రైతులకు, గ్రామీణ పేదలకు, పట్టణ పేదలకు చేయూత లభించదు.

రాష్ట్రంలో ఏర్పడ్డ దుర్భిక్షం-ముంపు పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే తక్షణ సహాయ, ఉపశమన చర్యలు; దీర్ఘకాల నివారణ చర్యలు చేపట్టాలని గ్రామీణ పేదలు, రైతాంగం సమైక్యంగా ఉద్యమించాలి.

**పట్టిక:2 2009 నుంచి ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటల విస్తీర్ణం (లక్షల హె.) సాధించిన దిగుబడి (మె.ట.ల్లో) ఈ విధంగా ఉంది**

| పంట | 2009 విస్తీర్ణం | దిగుబడి ల.మె.ట | 2010 విస్తీర్ణం | దిగుబడి ల.మె.ట | 2011 విస్తీర్ణం | దిగుబడి ల.మె.ట | 2012 విస్తీర్ణం | దిగుబడి ల.మె.ట |
|---|---|---|---|---|---|---|---|---|
| వరి | 29.22 | 59.56 | 28.75 | 75.10 | 28.74 | 85.62 | 28.50 | 87.81 |
| పప్పుదినుసులు | 7.55 | 2.40 | 9.88 | 4.35 | 7.08 | 2.76 | 9.15 | 4.48 |
| ఆహారధాన్యాలు | 38.01 | 74.75 | 45.81 | 98.72 | 43.12 | 105.80 | 45.41 | 114.18 |
| నూనెగింజలు | 14.98 | 15.43 | 18.83 | 23.36 | 14.74 | 6.41 | 18.25 | 15.88 |
| పత్తి | 14.67 | 32.32 | 17.76 | 38.80 | 20.54 | 33.59 | 19.50 | 47.26 |

**ఆధారం : ఆంధ్రప్రభ 3-10-12**

✡

# పెటీబూర్జువా సోషలిజం-శ్రామికవర్గ సోషలిజం

**లెనిన్**



**అనేక** సోషలిస్టు సిద్ధాంతాలలో, ఈనాడు యూరపు ఖండంలో మార్క్సిజం ఆధిపత్యంలో వుంది. సోషలిస్టు వ్యవస్థ సాధనకోసం సాగుతున్న పోరాటం దాదాపు మొత్తంగా సోషల్ డెమొక్రటిక్ పార్టీల మార్గదర్శకత్వంలో కార్మికవర్గ పోరాటంగా సాగుతున్నది. మార్క్సిస్టు బోధనలు పునాదిగా కార్మికవర్గ సోషలిజపు ఈ పూర్తి ఆధిపత్యం హఠాత్తుగా ఏర్పడలేదు; కాలం చెల్లిన సిద్ధాంతాలూ, పెటీబూర్జువా సోషలిజమూ, అరాచకవాదమూ తదితరాలపై దీర్ఘ పోరాటం తర్వాత ఏర్పడింది. ముప్ఫై ఏళ్ళక్రితం జర్మనీలో కూడా మార్క్సిజం పైచేయిగా లేదు. అక్కడ ఆనాటికున్న భావనలు మార్పు చెందే మధ్యంతర దశలో వున్నాయి; కలగాపులగంగానూ, రకరకాలుగానూ వున్నాయి. పెటీబూర్జువా, కార్మికవర్గ సోషలిజాలకు మధ్యస్తంగా వున్నాయి. రోమను దేశాలు, ఫ్రాన్సు, స్పెయిను, బెల్జియంలలో ప్రౌఢనిజం, బ్లాంకిజం, అరాచకవాదమూ విస్తృతంగా వ్యాపించి వున్నాయి. ఇవి పెటీబూర్జువా భావనలనే వ్యక్తం చేశాయితప్ప కార్మికవర్గ సోషలిజాన్ని కాదు.

గత దశాబ్దాలలో వేగంగానూ పూర్తిగానూ, మార్క్సిజం విజయానికి కారణమేమిటి? రాజకీయం గానూ, ఆర్థికంగానూ సమకాలీన సమాజాలలో వచ్చిన పరిణామాలు గతం కంటే ఎక్కువ విస్తారంగా మార్క్సిస్టు భావాల సవ్యతను నిరూపించాయి. అలాగే విప్లవోద్యమపు, పీడిత వర్గాల పోరాటపు మొత్తం అనుభవాలు కూడా దీనినే నిర్ధారించాయి. పెట్టీబూర్జువా వర్గపు క్షీణత కూడా ముందు వెనుకలుగా అన్నిరకాల పెటీబూర్జువా భావనలు క్షీణింప చేయటం అనివార్యమైంది; అదే సమయంలో పెట్టుబడిదారీ విధానవృద్ధీ, పెట్టుబడిదారీ సమాజంలో వర్గపోరాటం తీవ్రమవటమూ కార్మికవర్గ సోషలిజం భావాలను ముందుకు తెచ్చాయి.

రష్యా వెనుకబాటుతనం ఈ దేశంలో బూజుపట్టిన వివిధ సోషలిస్టు సిద్ధాంతాలు కాలూనుకొనడానికి సహజ కారణంగా వుంది.

గత పావు శతాబ్దపు రష్యా విప్లవకర భావజాల చరిత్ర అంతా నరోద్నిక్కుల పెటీబూర్జువా సోషలిజంపై మార్క్సిజం సాగించిన పోరాట చరిత్రే. రష్యా కార్మికోద్యమపు త్వరితవృద్ధీ, గణనీయ విజయమూ రష్యాలో మార్క్సిజానికి విజయాన్ని చేకూర్చగా, విప్లవకరమని నిస్సందేహంగా చెప్పగల రైతాంగ ఉద్యమ అభివృద్ధి-ప్రత్యేకించి 1920లలో ఉక్రెయిన్‌లో రైతాంగ తిరుగుబాట్ల తర్వాత-క్షీణించిన నరోద్నిజాన్ని కొంత పునరుద్ధరించాయి. పాత నరోద్నిక్కు సిద్ధాంతాలు ఫ్యాషనుగా తయారైన యూరోపు అవకాశవాదంతో (రివిజనిజం, బెర్న్‌స్టీనిజం, మార్క్సుపై విమర్శలు) కలిసిపోయి సోషలిస్టు విప్లవకారులనబడే వారి సైద్ధాంతిక అమ్మకం సరుకుగా తయారైంది. అందువల్లనే నరోద్నిక్కులతోనూ, సోషలిస్టు విప్లవకారులతోనూ మార్క్సిస్టుల వివాదాలకు రైతాంగ సమస్య కేంద్ర మయింది.

నరోద్నిజం ఒక మేరకు సమగ్రమైన, నిలకడైన సిద్ధాంతం. రష్యాలో పెట్టుబడిదారీ విధానపు ఆధిపత్యాన్ని అది తిరస్కరించింది. కార్మికవర్గపు అగ్రశ్రేణి పోరాట యోధులుగా ఫ్యాక్టరీ కార్మికుల పాత్రను తిరస్కరించింది. ఒక రాజకీయ విప్లవం, బూర్జువా రాజకీయ స్వేచ్ఛలకున్న ప్రాధాన్యతను తిరస్కరించింది. చిన్నతరహా వ్యవసాయ క్షేత్రాల రూపంలో రైతాంగ కమ్యూన్లనుండి తక్షణ సోషలిస్టు విప్లవాన్ని ప్రబోధించింది. ఇప్పుడు దీనిలో మిగిలివున్నది చిరిగిపోయిన ముక్కలే. అయితే ఈ వివాదాలను తెలివిగా అర్థంచేసుకునేందుకూ, ఇవి పసలేని తగాదాలుగా దిగజారకుండా చూసేందుకూ, మన సోషలిస్టు విప్లవకారులకున్న నరోద్నిక్కు మూలాలను మనం గుర్తుచేసుకోవాలి.

రష్యా భవిష్య మానవునిగా ముఝిక్‌ను నరోద్నిక్కులు పరిగణించారు. రైతాంగ కమ్యూనుకు సోషలిస్టు స్వభావముందన్న వారి విశ్వాసంనుండీ, అలాగే పెట్టుబడిదారీ విధాన భవిష్యత్తుపై వారికి విశ్వాసం లేకపోవటం నుండీ ఇది అనివార్యంగా ముందుకు వచ్చింది. రష్యా భవిష్య మానవునిగా కార్మికున్ని మార్క్సిస్టులు పరిగణించారు. రష్యా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు రెంటిలోను పెరుగుతున్న పెట్టుబడిదారీ విధానం మార్క్సిస్టుల వైఖరిని మరింతగా నిర్ధారించింది. రష్యాలో కార్మికవర్గ ఉద్యమం ఒక గుర్తింపును పొందింది. కాగా రైతాంగ ఉద్యమానికి సంబంధించి, ఈనాటికీ మార్క్సిస్టులూ, నరోద్నిక్కుల మధ్య కొనసాగుతున్న అగాధం రైతాంగ ఉద్యమానికి అర్థంచెప్పటంలో వారిమధ్య నున్న తేడాను తెలుపుతున్నది. నరోద్నిక్కుల దృష్టిలో రైతాంగ ఉద్యమం మార్క్సిజాన్ని ఖండిస్తున్నది; ఆ ఉద్యమం సూటైన సోషలిస్టు విప్లవాన్ని సమర్థిస్తున్నది; అది బూర్జువా రాజకీయ స్వేచ్ఛను గుర్తించదు; అది చిన్న స్థాయి ఉత్పత్తినుండి వస్తున్నది. ఒక్కమాటలో నరోద్నిక్కులకు అది సరైన, నిజమైన, తక్షణ సోషలిస్టు ఉద్యమం. రైతాంగ కమ్యూన్‌లో నరోద్నిక్కుల విశ్వాసమూ, నరోద్నిక్కు రకపు అరాచకవాదమూ ఇలాంటి నిర్ధారణల అనివార్యతను పూర్తిగా వివరిస్తాయి.

మార్క్సిస్టులకు రైతాంగ ఉద్యమం ప్రజాస్వామిక ఉద్యమం; సోషలిస్టు ఉద్యమం కాదు. ఇతర దేశాలలోలాగానే, రష్యాలో కూడా, ఆర్థికంగానూ సామాజికంగానూ బూర్జువా సారాంశంగల రైతాంగ ఉద్యమం ప్రజాస్వామిక విప్లవంతో పాటుగా సాగుతుంది. బూర్జువావ్యవస్థ పునాదిపై, సరుకుల ఉత్పత్తిపై, పెట్టుబడిపై అది ఎక్కుపెట్టబడదు. తద్భిన్నంగా అది గ్రామీణ ప్రాంతంలో అర్థబానిస పెట్టుబడిదారీ పూర్వసంబంధాలకు వ్యతరేకంగా, అర్థబానిసవ్యవవస్థకు మూలస్థంభమైన భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా సాగుతుంది. తత్పర్యవసానంగా, రైతాంగ ఉద్యమ సంపూర్ణ విజయం పెట్టుబడిదారీ విధానాన్ని రద్దుచేయబోదు. తద్భిన్నంగా దాని అభివృద్ధికి విశాల భూమికను సృష్టిస్తుంది. శుద్ధమైన పెట్టుబడిదారీ విధాన అభివృద్ధిని త్వరితంచేస్తుంది. రైతాంగ తిరుగుబాటు సంపూర్ణ విజయం ప్రజాస్వామిక బూర్జువా రిపబ్లిక్కుకు బలీయ భూమికను సృష్టిస్తుంది. ఆ రిపబ్లిక్కులో బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మివర్గ పోరాటం తన శుద్ధమైన రూపంలో మొదటిసారిగా అభివృద్ధిచెందుతుంది.

కనుక సోషలిస్టు విప్లవకారులకూ, సోషల్ డెమోక్రాట్లకూ మధ్యనున్న అగాధాన్ని సూత్రరీత్యా పరిశీలించగోరేవారు ఈ రెండు విరుద్ధ వైఖరులను స్పష్టంగా అర్థంచేసుకోవాలి. ఒక వైఖరి ప్రకారం రైతాంగ ఉద్యమం సోషలిస్టు స్వభావం కలిగి వుంది; కాగా మరో వైఖరి ప్రకారం అది బూర్జువా ప్రజాస్వామిక ఉద్యమం. సాంప్రదాయక మార్క్సిస్టులు రైతాంగ సమస్యను పట్టించుకోలేదని(రివల్యూషనయా రష్యా సంఖ్య 75) సోషలిస్టు విప్లవకారులు వందోసారి చెప్పటం వారి తెలివి తక్కువతనాన్ని తెలుపుతున్నది. ఇలాంటి అజ్ఞానాన్ని ఎదుర్కోవటానికి ఒకే దారి వుంది. మౌలిక సూత్రాలు చెప్పాలి; నరోద్నిక్కుల పాత వైఖరిని చెప్పాలి. తేడా రైతాంగ సమస్యను పట్టించుకోవాలా లేదా అన్న కోరిక వున్నదా లేదా అన్నది కాదనీ, దానిని గుర్తించటమా, లేదా అన్నది కాదనీ, ఈనాటి రష్యాలో రైతాంగ సమస్యనూ, ఈనాటి రైతాంగ ఉద్యమంపట్ల మన భిన్నమైన అంచనాల్లో వుందనీ వందసార్లు, వెయ్యిసార్లు చెప్పాలి. మార్క్సిస్టులు రష్యాలో రైతాంగ సమస్యను పట్టించుకోలేదనే వాడు అజ్ఞాని. ఎందుకంటే మొదటిగా ప్లెఖనోవ్ 'మన విబేధాలు' రచననుండి (ఇది వ్రాసి రెండు దశాబ్దాలయింది) రష్యా మార్క్సిస్టుల ప్రధాన రచనలన్నీ రష్యాలో రైతాంగ సమస్యపై నరోద్నిక్కుల తప్పు వైఖరులను వివరించటాన్నే ముఖ్యంగా చేశాయి. రెండు: ప్రస్తుత రైతాంగ ఉద్యమం బూర్జువా ప్రజాస్వామికమా కాదా; అర్థబానిసత్వానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిందా లేదా అన్న ప్రశ్నలకు సమాధానం యివ్వకుండా, రైతాంగ ఉద్యమంపట్ల తన సంపూర్ణ అంచనాను యివ్వకుండా తప్పించుకోవాలన్న తమ వాంఛతోనే ఇలా అంటున్నారని నిరూపితమౌతున్నది.

సోషలిస్టు విప్లవకారులు ఈ ప్రశ్నలకు ఎప్పుడూ సమాధానాలివ్వలేదు; యివ్వలేరు కూడా. ఎందుకంటే వారు ప్రస్తుత రష్యాలో రైతాంగ సమస్యపట్ల పాత నరోద్నిక్కుల వైఖరికీ, మార్క్సిస్టుల వైఖరికీ మధ్య కొట్టుకులాడు తున్నారు గనుక. సోషలిస్టు విప్లవకారులు తమ పెటీబూర్జువా భ్రమలను వదుల్చుకోని కారణంగానే, రైతాంగ ఉద్యమ అంచనాపై నరోద్నిక్కుల ఊహాకల్పనలను వదులుకోని కారణంగానే, వారు పెటీబూర్జువావర్గ వైఖరికి (పెటీ బూర్జువా సిద్ధాంత కర్తలు) ప్రతినిధులని మార్క్సిస్టులు అంటున్నారు.

అందువల్లనే మూలాల్లోకి మనం వెళ్లాలి. రష్యాలో ఈనాటి రైతాంగ ఉద్యమం దేనికోసం సాగుతున్నది? దీని సంపూర్ణ విజయానికుండే ప్రాధాన్యత ఏమిటి? స్వేచ్ఛను పొందిన తర్వాత అది భూస్వాముల, ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల పాలనను రద్దుచేస్తుంది. భూమిని పొందిన తర్వాత, అది భూస్వాముల ఎస్టేట్లను రైతాంగానికి వశపరుచుతుంది. సంపూర్ణ స్వేచ్ఛ, భూస్వాముల నుండి భూముల స్వాధీనం సరుకుల ఉత్పత్తిని ఆపగలుగుతాయా? లేదు, అలా చెయ్యలేదు. సంపూర్ణ స్వేచ్ఛ, భూస్వాముల భూముల స్వాధీనాలు రైతు కుటుంబాల వ్యష్టిసాగును రద్దుచేసి, కమ్యూను సాగు లేదా సోషలిస్టు సాగును తేగలవా? లేదు, అలా చెయ్యలేవు. సంపూర్ణ స్వేచ్ఛ, భూస్వామ్య విధానం రద్దులు అనేక గుర్రాలు, ఆవులుగల ధనిక రైతుకూ, పాలేర్లు వ్యవసాయకూలీలకూ మధ్య అగాధాన్ని, అంటే రైతు బూర్జువాకూ, గ్రామీణ శ్రామికులకు మధ్య అగాధాన్ని పూడ్చగలవా? లేదు, అలా చెయ్యలేవు. దానికి భిన్నంగా, భూస్వామ్య ఎస్టేట్లు ఎంత పూర్తిగా రద్దువుతాయో, అంతగా వర్గ వ్యత్యాసాలు, బూర్జువాలకూ, శ్రామికులకూ మధ్య పెరుగుతాయి. రైతాంగ తిరుగుబాటు సంపూర్ణ విజయపు పాదార్థిక ప్రాధాన్యత ఏమిటి? ఈ విజయం బూర్జువా ఆర్థికవ్యవస్థను తొలగిస్తుందా; పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేస్తుందా లేదా పేదలు, ధనికులు, బూర్జువాలు-కార్మికులు వంటి నేటి సమాజంలోని తేడాలను రద్దుచేస్తుందా? ఈనాటి రైతాంగ ఉద్యమం పెట్టుబడి పాలనను తొలగించకుండానే. ప్రజాస్వామిక సమాజానికి బూర్జువా ప్రజాస్వామిక పునాది ఎలా కాగలుగుతుంది? వర్గ చైతన్యంగల కార్మికులు ఈ ఉద్యమాన్ని ఎలా చూడాలి? కార్మికులు ఈ ఉద్యమాన్ని సమర్థించాలి. తమ శక్తినంతా కలిపి సహాయమందిచాలి. నిరంకుశాధికారుల, భూస్వాముల పాలనను తొలగించటంలో రైతాంగానికి సాయపడాలి. అదే సమయంలో, భూస్వాముల, నిరంకుశాధికారుల పాలనను తొలగించటమే చాలదని రైతాంగానికి వివరించాలి. అలాగే పెట్టుబడి పాలన తొలగింపుకు కూడా పూనుకోవాలి. దీనికోసం పూర్తి సోషలిస్టు అంటే మార్క్సిస్టు కార్యక్రమాన్ని వివరించి చెప్పాలి. గ్రామీణ శ్రామికులను ఐక్యపరచి సంఘటిత పరచాలి. రైతు బూర్జువాలకూ, మొత్తం రష్యా బూర్జువాలకు వ్యతిరేకంగా పోరాటాలలోకి సమీకరించాలి. వర్గచైతన్యంగల కార్మికుడు సోషలిస్టు విప్లవం కొరకు ప్రజాస్వామిక విప్లవాన్ని వదలిపెడతాడా? లేక ప్రజాస్వామిక విప్లవం కొరకు సోషలిస్టు విప్లవాన్ని వదులుకుంటాడా? లేదు; ఈ రెండు పోరాటాల మధ్యనున్న సంబంధాన్ని అర్థంచేసుకున్న కారణంగానే వర్గచైతన్యంగల కార్మికుడు తనను తాను సోషల్ డెమొక్రాటుగా చెప్పుకుంటున్నాడు. ప్రజాస్వామ్యం, రాజకీయ స్వేచ్ఛద్వారా తప్ప సోషలిజానికి మరోదారి లేదని అతనికి తెలుసు. కనుక తన అంతిమ లక్ష్యమైన సోషలిజాన్ని సాధించడానికి ప్రజాస్వామ్యాన్ని సంపూర్ణంగా నిలకడగానూ సాధించడానికి కృషిచేస్తాడు. ప్రజాస్వామిక పోరాట పరిస్థితులూ, సోషలిస్టు పోరాట పరిస్థితులూ ఒకటిగా ఎందుకు లేవు? ఎందుకంటే ఈ రెండు పోరాటాలలో కార్మికులకు విభిన్న స్నేహితులుంటారు గనుక. బూర్జువా వర్గంలో ఒక సెక్షనుతో, ప్రత్యేకించి పెటీబూర్జువా వర్గంతో కలిసి కార్మికులు ప్రజాస్వామిక పోరాటం సాగిస్తారు. మరోవైపున, బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మికులు సోషలిస్టు పోరాటాన్ని సాగిస్తారు. నిరంకుశాధికారులకూ భూస్వాములకూ వ్యతిరేకంగా పోరాటాన్ని రైతాంగమంతటితో, ధనిక, మధ్యతరగతి రైతాంగంతో కూడా, కలిసి కార్మికులు చేయాలి. కాగా, బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోరాటాన్ని గ్రామీణ శ్రామికులతో కలిసి చేయాలి. కనుక దానిని సరిగ్గా చేస్తే, ధనిక రైతులకు వ్యతిరేకంగా చేయాలి.

ఈ ప్రాథమిక మార్క్సిస్టు సూత్రాలను మనం గమనంలో వుంచుకుంటే-దీనినే సోషలిస్టు విప్లవకారులు గమనంలో వుంచుకోరు-వీరు మార్క్సిజంపట్ల ఇటీవల తెలుపుతున్న అభ్యంతరాలను అంచనా వేసుకోవటంలో కష్టమేమీ వుండదు.

రివల్యూషనయా రష్యా (సంఖ్య : 75) ఇలా ప్రకటిస్తున్నది. "భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగానికి మొదట మద్దతు, ఆ తర్వాత రైతాంగానికి వ్యతిరేకంగా కార్మికవర్గానికి మద్దతు తెలుపవలసిన అవసరమేమిటో, దీనికి బదులుగా భూస్వాములకు వ్యతిరేకంగా కార్మికవర్గానికి ఒకేసారి మద్దతు ఎందుకు తెలుపరాదో, దీనికీ మార్క్సిజానికీ సంబంధ మేమిటో భగవంతుడికే తెలియాలి".

ఇది అత్యంత తెలివిమాలిన పిల్లతనపు అరాచకవాద వైఖరి. అనేక శతాబ్దాలుగా, ఆమాటకొస్తే వేలాది సంవత్సరాలుగా అన్నిరకాల దోపిడీని "ఒక్కసారిగా" తొలగించాలని మానవాళి కలలు గన్నది. సమాజం సహజ క్రమాభివృద్ధి దిశలో పెట్టుబడిదారీ సమాజాన్ని మార్చే నిలకడైన, మొక్కవోని, సమగ్ర పోరాటంలోకి ప్రపంచంలోని పీడితులందరూ ఐక్యమయ్యేవరకూ ఈ కలలన్నీ వట్టికలలు గానే మిగిలిపోయాయి. మార్పు కొరకు ఆకాంక్షను ఒక వర్గపు పోరాటంతో మార్క్సు శాస్త్రీయ సోషలిజం జోడించిన తర్వాత మాత్రమే సోషలిస్టు కలలు లక్షలాదిమంది సోషలిస్టు పోరాటంగా రూపొందాయి. వర్గపోరాటానికి బయట సోషలిజం ఒక అర్థం లేనిపదం లేదా పనికిరాని కల. అయితే రష్యాలో మనకళ్లముందే రెండు భిన్న సామాజిక శక్తుల రెండు భిన్న పోరాటాలు సాగుతున్నాయి. పెట్టుబడిదారీ సంబంధాలున్న చోటల్లా బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడుతున్నది. (ఈ పెట్టుబడిదారీ సంబంధాలు రైతు కమ్యూను అంటే సామాజీకరించ బడుతుందన్న భూమిలో కూడా వున్నాయని సోషలిస్టు విప్లవకారులు తెలుసుకోవాలి) చిన్న భూముల స్వంతదారులుగా, పెట్టీ బూర్జువాలుగా, రైతాంగం భూస్వాములకూ, నిరంకుశాధికారులకూ వ్యతిరేకంగా పోరాడుతున్నది. రాజకీయ అర్థశాస్త్రం గురించీ, ప్రపంచంలో సాగిన విప్లవాల చరిత్ర గురించి పూర్తి అజ్ఞానంలో వున్నవారే ఈ రెండు విభిన్న విస్పష్ట సామాజిక యుద్ధాలను చూడనిరాకరిస్తారు. "ఒకేసారి" అంటూ యుద్ధాల్లోని భిన్నత్వాన్ని చూడకుండా కళ్లు మూసుకున్న వారు తమ చంకలో తమ తలను దూర్చుకుంటున్నారు; వాస్తవాన్ని విశ్లేషించేందుకు నిరాకరిస్తున్నారు.

పాత నరోద్నిక్కుల వైఖరులకున్న నిజాయితీని కోల్పోయిన సోషలిస్టు విప్లవకారులు ఆ నరోద్నిక్కులు చెప్పిన అనేక సూత్రాలను గూడా మరిచిపోయారు. రివల్యూషనయా రష్యా ఇలా వ్రాసింది. "భూస్వాముల భూముల స్వాధీనంలో రైతాంగానికి సహాయమందించి లెనిన్‌గారు అటూ ఇటూగా అభివృద్ధి చెందిన రూపాలలో వున్న పెట్టుబడిదారీ వ్యవసాయ శిథిలాలపై పెటీ బూర్జువా ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి తనకు తెలియకుండానే సహాయపడుతున్నాడు. సాంప్రదాయక మార్క్సిస్టు వైఖరి నుండి ఇది 'ఒక వెనుకడుగు' కాదా?"

పెద్ద మనుషులారా, సిగ్గు సిగ్గు. మీ స్వంత వివినే (వొరొనోత్సొవ్) ఎందుకు మరిచిపోయారు? ఆయన రచన "పెట్టుబడిదారీ విధాన భవిష్యత్తు"ను చూడండి. నికొలయ్ రాసిన స్కెచెస్‌ను చూసి తెలివి తెచ్చుకోండి. అప్పుడు మీకు రష్యాలో భూస్వాముల సాగు పెట్టుబడిదారీ, అర్థబానిస లక్షణాలూ రెంటినీ ఎలా కలిపివేసిందో అర్థమౌతుంది. కార్వీ పద్ధతి అవశేషమైన శ్రమకౌలు పునాదిగాగల ఆర్థిక వ్యవస్థ మీకు కనపడుతుంది. మీరుగనక సాంప్రదాయక మార్క్సిస్టు గ్రంథమైన మార్క్సు 'పెట్టుబడి' మూడవ సంపుటిని చూసే శ్రమ తీసుకుంటే, పెటీబూర్జువా రైతాంగ సాగు ద్వారా తప్ప మరొక విధంగా కార్వీ వ్యవస్థ అభివృద్ధి కాలేదనీ, దాని ద్వారా తప్ప అది పెట్టుబడిదారీ విధానంగా అభివృద్ధి చెందలేదనీ తెలుస్తుంది. మార్క్సిజాన్ని చిందర వందర చెయ్యాలన్న పనిలో మీరు అత్యంత అనాగరికమైన పాత పద్ధతినే అనుసరించారు. కార్వీ పద్ధతిపై ఆధార పడిన విశాల ఖండాల సాగు ప్రత్యక్షంగానే విశాల భూఖండాల పెట్టుబడిదారీ సాగుగా మారుతుందన్న దెయ్యపు అబద్ధాన్ని మార్క్సిజానికి అంటగడుతున్నారు. భూస్వాముల భూముల్లో దిగుబడులు, రైతాంగ భూముల్లో దిగుబడులకంటే ఎక్కువుంటాయి గనుక భూస్వాములను రద్దు చేయటం వెనుకడుగని వాదిస్తున్నారు. ఇది నాల్గవతరగతి చదివే బాలుడుచేసే వాదనలావుంది. పెద్దమనుషులారా ఆలోచించండి. భూస్వామ్య వ్యవస్థ

(తరువాయి 5వ పేజీలో)

# పని ప్రదేశాల్లో 'ప్రమాదాలు'

## చైనా

**2012** జులై 31న-చైనాలోని లోతట్టు వైగూర్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలోని గ్జింజింగ్ వద్దనున్న ఇనుప ఖనిజ గనుల్లోని ఒక దానిలో జరిగిన 'ప్రమాదంలో' 18 మంది కార్మికులు మృతిచెందగా, మరో పదిమంది కార్మికులు అతిపెద్ద మట్టి చరియక్రింద కప్పెట్టబడిన వర్కుషెడ్‌లో గల్లంతయ్యారు.

## ఇరాన్

ఆగస్టు 3న-ఇరాన్ రాజధానీ నగరం టెహరాన్‌లోని బందార్ ఇమామ్ పెట్రో కాంప్లెక్స్ వద్ద జరిగిన పెద్ద అగ్నిప్రమాదంలో ఒక కార్మికుడు చనిపోగా, 15 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.

## పెరూ

ఆగస్టు 6న-పెరూలోని లిమావద్ద, అత్యంత పెద్దవైన రాగి గనులలో ఒకటైన అంటామినా రాగి గనిలో పైపులైను బ్రద్దలై విషపూరితవాయువు వెలువడిన కారణంగా సమీపంలోని శాంతారోజా-డి-కజాకే గ్రామానికి చెందిన 140 మందిపైగా గ్రామస్థులు వాంతులు, తలనొప్పి, ముక్కులనుండి రక్తస్రావంవంటి జబ్బులతో తీవ్రమైన జబ్బులకు గురయ్యారు.

## చైనా

ఆగస్టు 13న-చైనా ఈశాన్య ప్రాంతంలోని జలిన్ రాష్ట్రం-బైషాన్ నగరంలోని జిషియాంగ్ బొగ్గుగనిలో జరిగిన 'ప్రమాదం'లో నలుగురు కార్మికులు మృతి చెందగా, మరో 17మంది అందులో చిక్కుకు పోయారు. ఈ గని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నది.

## కాంగో

ఆగస్టు 16న-కాంగో దేశంలో-మొంబాసాకు 120 కి॥మీ దూరంలోని ప్రాచీన నగరం పాంగోయ్‌లో, బంగారు గనిలోని పై కప్పు కూలిపోయిన దుర్ఘటనలో 100 మీటర్ల లోతున భూగర్భంలో పనిచేస్తున్న 60 మంది కార్మికులు మరణించారు. ఈ బంగారు గని సైన్యం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నది. గనులలో చేపట్టే భద్రతా ప్రమాణాలు, వ్యవస్థలగురించి ప్రభుత్వం వైపునుండి ఏవిధమైన పర్యవేక్షణా లేకపోవటంతో, ఈ విధమైన గనులలో సంభవించే ప్రమాదాలలో వందలాది మంది కార్మికులు మరణించటమనేది కాంగోలో సర్వసాధారణమైంది.

## వెనిజులా

ఆగస్టు 26న- వెనిజులాలోని అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారమైన అనుయయ్‌లో ప్రేలుడు జరిగింది. పెద్దఎత్తున చమురు వాయువు ఒక్కసారిగా వెలువడటం వలన అతిపెద్ద విస్ఫోటనం ఘటనలో కనీసం 39మంది మృత్యువాత పడగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు.

## చైనా

ఆగస్టు 29న-చైనాలోని పాంజిహువా నగరంలోని గ్జియావో జియావాన్ బొగ్గుగనిలో జరిగిన వాయువు పేలుడు 26మంది కార్మికులను బలిగొనగా, 28మంది కార్మికులు గల్లంతయ్యారు. కార్మికులు భూగర్భంలోకి జొచ్చుకెళ్ళి తమ పని చేస్తూవుండగా ఈ ప్రమాదం సంభవించింది. జెంగిన్ ఇండస్ట్రీ అండ్ ట్రేడ్ కంపెనీ ఈ గని యజమానిగా వుంది. సెప్టెంబరు 2 నాటికి, చనిపోయిన కార్మికులసంఖ్య 43కు చేరుకొంది.

## పాకిస్థాన్

సెప్టెంబరు నెల మొదటి నాలుగురోజులలోనూ, చైనాలోని జియాంగ్క్సి రాష్ట్రంలోని గోకెంజ్ బొగ్గుగనిలో జరిగిన ప్రమాదాలలో 15మంది దుర్మరణం పాలయ్యారు.

సెప్టెంబరు 9న-చైనాలోని కానర్ రాష్ట్రం, జాంగ్యీ నగరంలోని హువాకువాటన్ బొగ్గుగనిలో అందరూ నిలబడే వేదిక తల్లక్రిందులు కావటంతో కనీసం 10 మంది మరణించారు.

సెప్టెంబర్ 12న-పాకిస్థాన్‌లోని కరాచీ నగరంలో ఓ దుస్తుల పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 290 మంది మరణించారు. కరాచీలోని బాల్దియా నగర ప్రాంతంలోని నాలుగు అంతస్థుల దుస్తుల పరిశ్రమ భవనంలోపల వెయ్యిమందిపైగా కార్మికులు పనిలో వున్న సమయంలో, అగ్నిప్రమాదం బ్రద్దలైంది. కార్మికులు బయటకు వెళ్ళటానికి ఒకే ఒక్కద్వారం వుండటం, అది కూడా తాళంవేసి వుండటంతో చావు భయంతో తీవ్ర ఆందోళనకు గురైన కార్మికులు కిటికీలగుండా క్రిందకు దూకి తీవ్ర గాయాల పాలయ్యారు. దాదాపు 65 మంది కార్మికులకు ఈవిధంగా కాళ్ళు, చేతులు విరిగి, తలలు పగిలి చావు బతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్నారు. తగినన్ని ద్వారాలు లేకపోవటంవలన తొక్కిసలాట జరిగి ద్వారాలవద్ద కుప్పలుగా పడి చనిపోయినవారు, చుట్టుముట్టిన మంటలలో కాలి బూడిదయ్యారు. ఈ దుస్తుల పరిశ్రమకు అనుమతి లేదని అధికారులు ప్రకటించారు. లైసెన్స్ ఉండటం, ఉండకపోవటం అనే దానితో నిమిత్తంలేకుండా పని ప్రదేశంలో కార్మికుల భద్రతా ఏర్పాట్లు, ముఖ్యంగా అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకునే చర్యలు ఇంతే ఘోరంగా ఉంటూవస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో ఇలాంటి అగ్ని ప్రమాదాలలో ఎంతోమంది హతులయ్యారు. దాదాపు ఇలాంటి ప్రమాదాలన్నీ బహుళ అంతస్థుల భవనాల్లో సంభవించినవే. ఈ భవనాల్లో ముఖ్యంగా మహిళా కార్మికులను అత్యధికంగా వినియోగిస్తూ, వారిని బయటకు వెళ్ళనీయకుండా నిర్బంధిస్తూ, కనీస విశ్రాంతి లేకుండా వారిచే నిర్బంధ వెట్టిచాకిరీ చేయించటం జరుగుతున్నది. శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఇండియా, వియత్నాం వంటి మూడవ ప్రపంచ దేశాలలోని దుస్తుల ఎగుమతి పరిశ్రమలలో ఈ విధమైన అమానవీయ శ్రమదోపిడీ సాగుతున్నది. మహిళా కార్మికులకు సైతం కనీస భద్రత కల్పించని ఈ విధమైన దుర్మార్గ కార్మిక విధానాలు, ఆచరణలపై ఆయా దేశాల ప్రభుత్వాలవైపు నుండి ఏవిధమైన నియంత్రణ లేవు. పెద్దఎత్తున కార్మికుల ప్రాణాలను బలిగొనే ఈ విధమైన అగ్నిప్రమాదాలు సంభవించటానికి ఇదే ప్రధాన కారణంగా వుంది. కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టి సూపర్ లాభాలు గడించటమే ధ్యేయమైన యాజమాన్యపు నిర్వహణలో, ప్రభుత్వ అనుమతి వుండటమనేది ఏవిధంగానూ ఈ తరహా ప్రమాదాలను ఆపటమో లేక తగ్గించటమో సాధ్యంకాదు.

అదే రోజున-సెప్టెంబర్ 12ననే, పాకిస్థాన్‌లోనే లాహోర్‌లోని ఓ చెప్పుల తయారీ కంపెనీలో జరిగిన మరో అగ్ని ప్రమాదంలో 26 మంది కార్మికులు మృతిచెందారు.

## చైనా

సెప్టెంబర్ 25న, చైనాలోని గాన్సు రాష్ట్రం-బేయి ఇన్ నగరంలోని బొగ్గుగని గోతుల్లో 34 మంది గని కార్మికులను తీసుకువెళ్ళే రెండు క్యారియర్లు ఢీ కొట్టుకోవటం వలన 20మంది కార్మికులు మృతిచెందగా మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు.

### భారతదేశంలో 'ప్రమాదాలు'

## ఛత్తీస్‌ఘడ్

జులై 21న-ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం-పారిశ్రామిక పట్టణమైన కోర్బావద్ద నిర్మాణంలోనున్న థర్మల్ విద్యుత్ కేంద్రంలో జరిగిన ఓ దుర్ఘటనలో 5 మంది కార్మికులు సజీవ సమాధి చేయబడ్డారు.

## ఆంధ్రప్రదేశ్

జులై 22న-ఆంధ్రప్రదేశ్‌లోని జీడిమెట్ల వద్దనున్న కార్మెల్‌డ్రగ్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ ఉద్యోగి ఒకరు పని ప్రదేశంలో సంభవించిన అగ్ని ప్రమాదానికి గురై, 9 రోజుల తర్వాత మరణించాడు.

జులై 24న-ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం వద్ద ఇసుక క్వారీలో జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మరణించగా ఇతరులకు గాయాలయ్యాయి.

## రాజస్థాన్

జులై 19న-రాజస్థాన్‌లోని 'కోట'కు దగ్గరలో రావత్ బాటావద్ద రాజస్థాన్ ఆటమిక్ పవర్‌స్టేషన్‌లో మాడ్యులేటర్ సిస్టమ్ పంపునుండి అణుధార్మికత వెలువడటం ఫలితంగా, కార్మికులు-వీరిలో అత్యధికులు కాంట్రాక్టు కార్మికులు-ఈ టైటానియమ్ అణుధార్మికతకు గురయ్యారు. వెలువడిన అణుధార్మికత నిర్ణీత పరిమితుల్లో వుంది కనుక, అది గురైన కార్మికులకు ఏవిధమైన ప్రమాదమూ వుండదని అధికార్లు ప్రకటించారు. ఈవిధంగా అణుధార్మికత వెలువడటం, దానికి కార్మికులు గురికావటం అనేది ఇక్కడ ఒక సాధారణ విషయంగా మారిపోయింది.

## తమిళనాడు

ఆగస్టు 8న-తమిళనాడు రాష్ట్రం-కాంచీపురం జిల్లా సుంగువర్చత్రమ్‌కు దగ్గరలోని కున్నమ్ గ్రామంలో నిర్మాణంలోనున్న ఓ ఇంజనీరింగ్ కళాశాల బాస్కెట్‌బాల్ స్టేడియం వెలుపలి గోడకూలిపోవటంతో, దాని క్రిందపడి ఒడిషానుండి వచ్చిన 9 మంది వలస కార్మికులు మృతిచెందారు.

## ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 8న-ఆంధ్రప్రదేశ్‌లోని-సింగరేణి కాలరీస్‌కు చెందిన గోదావరిఖని భూగర్భగనిలో గనులు తొలుస్తున్న కార్మికునిపై పైకప్పులోని కొంతభాగం విరిగిపడి ఆ కార్మికుడు అక్కడే మరణించాడు. యాజమాన్యం ఈ ప్రమాదాన్ని కప్పెట్టటానికి ప్రయత్నించింది. కానీ, కార్మికుల ఆందోళన ఫలితంగా దానిని ప్రమాదంగా నమోదు చేశారు.

ఆగస్టు 3న-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం-నల్గొండజిల్లా పోచంపల్లి పేపరు మిల్లులో ఒక కార్మికుడు కాగిత గుజ్జుమిశ్రమంలోకి జారిపడి, నలిగిపోయి మృతిచెందాడు.

## ఉత్తరప్రదేశ్

ఆగస్టు 8న-ఉత్తరప్రదేశ్ రాష్ట్రం-లక్నోలోని గోపాల్‌నగర్ వద్దనున్న ఓ ఐస్‌ఫ్యాక్టరీనుండి వెలువడిన అమ్మోనియా వాయువు ఫలితంగా, వాంతులు, దద్దుర్లు తదితర లక్షణాలతో 5గురు కార్మికులు తీవ్రంగా అస్వస్థులయ్యారు. వందలాది మంది ఆప్రాంత వాసులను వారి వారి ఇండ్లనుండి ఖాళీ చేయించారు.

## ఆంధ్రప్రదేశ్

ఆగస్టు9న - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం - కాకినాడ నౌకాశ్రయంలో నిలిపివేయబడిన ఒక ఓడలోకి బియ్యం బస్తాలను జేరవేస్తున్న ఓ కార్మికుడు, జారి సముద్రంలో పడిపోయి జలసమాధి చేయబడ్డాడు.

## తమిళనాడు

ఆగస్టు 14న-తమిళనాడులోని తూత్తుకుడివద్ద ఐఎఎన్‌బి విద్యుదుత్పత్తి కంపెనీలో అకస్మాత్తుగా వ్యాపించిన మంటలలో చిక్కుకుని నలుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.

## ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15న-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ వద్ద స్టీమ్‌కోర్ ఇస్పాత్ (ప్రై) లిమిటెడ్ పరిశ్రమలో, బాయిలర్ బద్దలవటంవలన, అగ్ని ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు మరణించగా మరో పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ సెలవు దినం అయినప్పటికీ ఆరోజున కూడా శలవు ఇవ్వకుండా యాజమాన్యం కార్మికులచే పనిచేయిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

## ఒడిషా

ఆగస్టు 18న ఒడిషా రాష్ట్రం-సునాబేడావద్ద హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌లో అగ్నిప్రమాదం సంభవించి ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.

## ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 18న-ఆంధ్రప్రదేశ్‌లోని నిజామాబాద్‌జిల్లా, నవీపేటలోని ఓ తుక్కు ఇనుము దుకాణంలో పనిచేసే ఓ కార్మికుడు ఇనుప ముక్కలన్నింటినీ కుప్పగా పేర్చుతుండగా జరిగిన ఓ ప్రేలుడులో తీవ్రంగా గాయపడ్డాడు.

ఆగస్టు 18న-ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్ జిల్లాలో పాలమూరు విశ్వవిద్యాలయం ఆవరణలో నిర్మాణంలోనున్న ఓ భవనం కప్పుకూలిపోయిన దుర్ఘటనలో ఓ మహిళా కార్మికురాలు మృతిచెందగా, మరో 8 మంది ఆమె సహచర కార్మికులు గాయపడ్డారు.

ఆగస్టు 24న-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరుజిల్లా నేలపాడు గ్రామంలో ఓ కాంట్రాక్టు విద్యుత్ కార్మికుడు తోటి పనివారితో కలిసి విద్యుత్ లైన్లు మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్తు ప్రసరించి మృతిచెందాడు.

## జమ్ముకాశ్మీర్

ఆగస్టు 24న-జమ్ముకాశ్మీర్ రాష్ట్రం-శ్రీనగర్‌కు 35 కి॥మీ దూరంలోని బ్రంజన్ గ్రామంవద్ద మట్టిపని జరుగుతున్న పనిప్రదేశంలో పెద్దఎత్తున ఇసుక కప్పెట్టేయటంతో ఓ కార్మికుడు మరణించాడు.

## మహారాష్ట్ర

సెప్టెంబరు 4న-ముంబయిలో నిర్మాణంలోనున్న మెట్రో రైలుబ్రిడ్జిలోని ఓ భాగం కూలిపోవటంతో ఒక నిర్మాణ కార్మికుడు మృతిచెందగా మరో 10మంది కార్మికులు గాయాలపాలయ్యారు. మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణంలో ఈ విధమైన ప్రమాదాలు జరగటం, కార్మికులను బలిగొనటం సాధారణమైన విషయంగా మారింది. ఏప్రిల్, జులై నెలల్లో ఈ విధమైన 'ప్రమాదాలు' సంభవించాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరిశ్రమ ఈ మెట్రో రైలు నిర్మాణ పనిని చేపట్టి, నిర్వహిస్తున్నది.

## తమిళనాడు

సెప్టెంబర్ 5న-తమిళనాడు రాష్ట్రం-శివకాశిలోని వడ్డియార్, ముదల్‌పొట్టి గ్రామాల నడుమ ఓంశక్తి బాణాసంచా కర్మాగారంలో జరిగిన భారీ ప్రేలుడులో 56మంది చనిపోయారు. కార్మికులతోబాటుగా, ఈ పరిశ్రమ పరిసరాల్లో వున్నవారు కూడా ఈ ప్రేలుడు వాతబడ్డారు. తమిళనాడులోని శివకాశీలో ప్రతిఏటా ఈ బాణసంచా కర్మాగారాలలో ప్రమాదాలు జరగటం-కార్మికులను బలిగొనటం అనేది రివాజుగా మారిపోయింది.

## ఆంధ్రప్రదేశ్

సెప్టెంబర్ 9న-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం-గోదావరిఖని బొగ్గుప్రాంతంలో రామగుండంవద్దనున్న గ్లోబల్‌కోల్ అండ్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ఓ కార్మికుడు వాషరీస్ బెల్ట్‌నుండి జారిపడి మృతిచెందాడు. విధులలో వుండగా పనిప్రదేశంలో మరణించిన కార్మికుల కుటుంబాలకి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేస్తూ, ఈ పరిశ్రమ కార్మికులు పరిశ్రమ జనరల్ మేనేజర్‌ను ఒక గుంజకు తాళ్ళతో బంధించారు. ఏఐటియుసి, హెచ్.ఎమ్.ఎస్., టిడిపి మొదలైన వాటి అనుబంధ యూనియన్ల నాయకులంతా కార్మికుల ఈ చర్యకు మద్దతునిచ్చారు. వారంతా కలిసి భారీస్థాయి ధర్నా నిర్వహించారు కూడా. 15 లక్షల నష్టపరిహారం చెల్లించేందుకు అంగీకరిస్తూ యాజమాన్యం ప్రకటన చేసింది. అదేవిధంగా అంత్యక్రియలకు 30వేల రూ॥లతో పాటుగా కుటుంబంలోని ఒకరికి ఉద్యోగావకాశం కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించింది.

సెప్టెంబర్ 15న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం-విశాఖపట్నం గాజువాక ప్రాంతంలోని అలుఫ్లోరైడ్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో రసాయనాల మిశ్రమం మీద పడటంతో ఒక కార్మికుడు మరణించగా, ఇద్దరు కార్మికులు తీవ్రగాయాల పాలయ్యారు.

## మహారాష్ట్ర

సెప్టెంబర్ 16న-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం-మెదక్‌జిల్లా కొడపాకల గ్రామంవద్ద క్రిందకు జారిపోయిన విద్యుత్ తీగలను బిగించి కట్టి మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్తు ప్రసారమై ఒక కార్మికుడు మరణించగా, మరో ఏడుగురు గాయపడ్డారు.

సెప్టెంబర్ 16న-మహారాష్ట్ర-చంద్రాపూర్ జిల్లాలోని వెస్ట్రన్‌కోల్ ఫీల్డ్స్‌లో ఓపెన్‌కాస్ట్ మైనింగ్ జరుగుతుండగా జరిగిన ప్రేలుడుకు ప్రాజెక్టు మేనేజర్‌తోపాటు ఇద్దరు కార్మికులు కూడా మృతిచెందారు. మరో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు.

## ఆంధ్రప్రదేశ్

సెప్టెంబర్ 26న-విశాఖజిల్లా-పరవాడవద్ద సింహాద్రి ఎన్‌టిపిసిలో హీరా ఇంజనీరింగ్ కంపెనీ తరఫున పనిచేస్తున్న ఒక వెల్డింగ్ కార్మికుడు, 40 మీటర్ల ఎత్తునుండి జారిపడిపోయి మృతిచెందాడు. చాలా ఎత్తులో వెల్డింగ్ చేస్తుండగా ధరించిన రక్షణ బెల్టు తెగిపోయి అతను మృతిచెందాడు.

## ఉత్తరప్రదేశ్

అక్టోబర్ 3న-లక్నోలోని ఓ ప్లైవుడ్ పరిశ్రమలో బాయిలర్ బ్రద్దలయిన కారణంగా ఫ్యాక్టరీ మేనేజర్ మృతిచెందాడు. 9మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. బాయిలర్ పేలిన సమయంలో ఆ పనిప్రదేశంలో 40మంది కార్మికులు పనిచేస్తున్నారు. ✸




**రిటైల్ రంగంలో తోడేళ్ళ మంద**

(వ్యాససంకలనం) వెల:

సిపిఐ(ఎం-ఎల్) ప్రచురణ 12/-

కాపీలకు : మైత్రీ బుక్ హౌస్

28-9-1,జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్,

విజయవాడ-2

# వివిధ ప్రపంచ దేశాలలో కార్మికుల ఆందోళనలు

## యూరప్‌లో 'పొదుపు చర్యల'కు వ్యతిరేక ఆందోళనలు

యూరప్ ఖండంలోని వివిధ దేశాల ప్రభుత్వాలు ఇప్పటికే చేపట్టి, అమలుజరుపుతున్న 'పొదుపు చర్యల' ఫలితంగా కార్మికుల, ప్రజల సమస్యలు; పేదరికం మరింత తీవ్రమవటంతో కార్మికవర్గం ఆయా దేశాల ప్రభుత్వ విధానాల్ని నిరసిస్తూ నిర్వహిస్తున్న ఆందోళనలతో ఆయా దేశాలు కుదిపివేయబడుతున్నాయి. కార్మికుల జీవితాలను మరింత దుర్భరం చేస్తూ నిరుద్యోగం కార్చిచ్చులాగా వ్యాపిస్తున్నది.

పొదుపు చర్యల పేరిట బడ్జెట్‌లలో కోతలు విధించటమనేది-ఉద్యోగాలలో కోతకు, వేతనాలలో కోతకు, పెన్షన్లు ఇతర సౌకర్యాల కుదింపుకు దారితీయగా, దీనికితోడు అనేక వస్తువులపై, ఆహార పదార్థాలపై విలువ ఆధారిత పన్నుల పెంపు; తక్కువ ఆదాయాలుగల కుటుంబాలలో బడిపిల్లలకు ఉచిత మధ్యాహ్న భోజన పథకం రద్దువంటి చర్యలు తోడవటంతో కార్మికుల జీవితాలు మరింత గడ్డుగామారి, ఆయా ప్రభుత్వాల ఈ 'పొదుపు చర్యల'కు వ్యతిరేకంగా నిరసనాందోళనలు మిన్నంటుతున్నాయి.

### స్లవోకియా

2012 ఏప్రిల్ 18న స్లవోకియాలోని ప్రభుత్వ ఉద్యోగులు వారి విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ప్రభుత్వమనుసరించే పొదుపు చర్యల ఫలితంగా వారి వేతనాలలో 7శాతం కోత విధించబడింది. 80వేల మంది ఉద్యోగులు దేశ వ్యాపితంగా జరిగిన ఈ ఒకరోజు నిరసనలో పాల్గొన్నారు.

### జెక్ రిపబ్లిక్

ఏప్రిల్ 21న జెక్ దేశంలో వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రేగ్‌లో భారీ నిరసన ధర్నాను చేపట్టారు. తమ ప్రభుత్వం చేపట్టిన పొదుపు చర్యలలో భాగంగా పన్నుల పెంపుదలను, పెరుగుతున్న అవినీతిని వారు ఎలుగెత్తి నిరసించారు. కార్మికులు తమ కుటుంబాల కనీస అవసరాలను తీర్చుకోవటానికి రెండు లేదా మూడు ఉద్యోగాలు చేయవలసిన దుర్భర పరిస్థితులు నేడు ఈ దేశంలో నెలకొనివున్నాయి.

### జర్మనీ

మే 19న, 25వేల మంది ప్రజలు జర్మనీ దేశంలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'ఫ్రాంక్‌ఫర్ట్‌ను ఆక్రమించండి' నినాదంతో ప్రభుత్వ పొదుపు చర్యలను నిరసిస్తూ అంతకు నాలుగు రోజులనుండీ ఫ్రాంక్‌ఫర్ట్‌లో నిరసన ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించారు.

### స్పెయిన్

ఏప్రిల్ 30న, స్పెయిన్ దేశ వ్యాపితంగా 30 నగరాలలో తమ ప్రభుత్వం చేపట్టిన పొదుపు చర్యలను నిరసిస్తూ ప్రదర్శనలు జరిపారు. రాజధానీ నగరం మాడ్రిడ్‌లో భారీ నిరసన ధర్నాను నిర్వహించారు.

వాస్తవానికి స్పెయిన్‌లో నిరుద్యోగం 25 శాతానికి పెరిగింది. స్పెయిన్ జనాభాలో 22శాతం మంది పేదరికంలో జీవిస్తున్నారు. ఆరు లక్షల కుటుంబాలకు కనీస ఆదాయం లేదు. మాడ్రిడ్‌లాంటి నగరాల్లో చెత్తకుప్పల్లో ఆహారంకోసం వెదుక్కుంటున్న దయనీయ దృశ్యాలు కన్పడుతున్నాయి. యువతలో 50శాతం మందికీ, మరియూ అనేక కుటుంబాలకూ ఉపాధి కరవైంది. 'కారిటాస్' అనే కాథలిక్ ఛారిటి ఆర్గనైజేషన్ నివేదిక ప్రకారం 2010 సం॥లో ఈ సంస్థ ఒక్కటే ఆకలితోనున్న 10 లక్షలమంది స్పెయిన్ దేశీయులకు ఆహారాన్ని అందించింది. ఈ సంఖ్య 2007లో ఆహార మందించిన వారి సంఖ్యకు రెట్టింపుగా వుంది. ఈ సంఖ్య 2011లో 65,000 మందికి పైగా పెరిగింది; 2012లోనూ అదే పరిస్థితి కొనసాగుతున్నది.

మే 13న స్పెయిన్ దేశవ్యాపితంగా భారీ నిరసన ధర్నాలు నిర్వహించారు. సెప్టెంబర్ 25న మాడ్రిడ్‌లో నిరసనకారులు పొదుపు చర్యలను నిరసిస్తూ పార్లమెంటు భవనాన్ని చుట్టుముట్టారు.

జులై 14న – ప్రభుత్వ పొదుపు చర్యలకు, వేతనాల కోతలకు, పన్నుల పెంపుకు నిరసనగా ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు భారీ నిరసన ధర్నా, ప్రదర్శనలను నిర్వహించారు.

జులై 18న స్పెయిన్ దేశ పోలీసులు సైతం, పార్లమెంటు భవనం ఎదుట అగ్నిమాపక సిబ్బందితో కలసి భారీ ధర్నా నిర్వహించి పొదుపు చర్యలను నిరసించారు.

జులై 20న స్పెయిన్‌లో దేశవ్యాపితంగా అన్ని పట్టణాలు, నగరాల్లో కార్మికులు, ఉద్యోగులు వీధుల్లోకి వచ్చి భారీ నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. పోలీసుల లాఠీఛార్జీలను, రబ్బరు బుల్లెట్ల ప్రయోగాలకు బెదిరిపోలేదు.

సెప్టెంబర్ చివరి వారంలో మాడ్రిడ్‌లో 10 రోజులపాటు వేలాదిమంది ప్రజలు భారీ నిరసన ప్రదర్శనలను, ధర్నాలను నిర్వహించారు. సెప్టెంబరు 25న నిరసనకారరులు స్పెయిన్ కాంగ్రెస్ భవనాన్ని చుట్టుముట్టారు. 80 సంస్థలకు చెందిన 47వేలమంది ప్రజలు పొదుపు చర్యలకు వ్యతిరేకంగా సాగిన ఈ నిరసన ప్రదర్శనలు, ధర్నాలలో పాల్గొన్నారు. తిరిగి సెప్టెంబర్ 30న మాడ్రిడ్‌లో భారీ నిరసనప్రదర్శన, ధర్నాలను నిర్వహించారు.

### గ్రీస్

గ్రీస్‌లో కూడా స్పెయిన్ పరిస్థితిలాగే వుంది. పేదరికంతో బాధపడ్తున్న శ్రమజీవులు పొదుపు చర్యలకు, వేతనాల కోతలకు వ్యతిరేకంగా నిరసనాందోళనలకు నెట్టబడుతున్నారు.

సెప్టెంబర్ 8న, 4 వేలమంది పైగా పోలీసులు గ్రీస్‌లోని ఏథెన్స్ నగరంలో ఆ దేశ ప్రభుత్వ పొదుపు చర్యలను నిరసిస్తూ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనకారులు 'దొంగలు...దొంగలు' అంటూ నినాదాలు చేశారు. వారి దుర్భర పరిస్థితులకు కారణమైన ఇ.యు; యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, ఐఎమ్‌ఎఫ్‌లనే మూడు పెద్ద కుండలను వేలడదీస్తూ, వ్యాన్‌పై వుంచి ఊరేగించారు.

సెప్టెంబర్ 17న గ్రీస్ దేశంలో పొదుపు చర్యలతో ప్రవేశపెట్టే బడ్జెట్‌కు ప్రజావ్యతిరేకత తీవ్రమైంది. న్యాయమూర్తులు తమ విధులను నిలిపివేశారు. వైద్యులు సమ్మె చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు నిరంతరాయంగా వివిధ నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. గ్రీస్ దేశంలో అంగవికలురైన వారు కూడా సెంట్రల్ ఏథెన్స్‌లో ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు.

సెప్టెంబర్ 26న 50వేల మందికి పైగా ప్రజలు గ్రీస్‌లో ఏథెన్స్-పార్లమెంట్ భవనంవద్దకు కవాతు నిర్వహించి 'అప్పిచ్చే వారికి మేము లొంగిపోము' 'ఇ.యు., ఐఎంఎఫ్ బయటకు వెళ్ళాలి' అని నినాదాలు చేశారు. గ్రీస్ దేశ వ్యాపితంగా సార్వత్రిక సమ్మె నిర్వహించబడింది. ఆందోళనకారులకు-పోలీసులకు నడుమ ఘర్షణలను పెంచి నిరసనకారులను క్రూరంగా అణచివేయటానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు.

### పోర్చుగల్

సెప్టెంబర్ 30న, వేలాదిమంది కార్మికులు పోర్చుగల్ దేశం-లిస్బన్‌లోని ప్రాకా-డో-న్ మెరికా స్క్వేర్‌వద్ద వేలాదిమంది కార్మికులు నిరసన ప్రదర్శనను నిర్వహించి ప్రభుత్వం పొదుపు చర్యల పేరిట సంక్షేమ పథకాలలో కోతలను తద్వారా వేతనాల కోత, పెన్షన్ల కోతలను నిరసించారు. నిరసనాందోళనాకారులు మరో 40 పోర్చుగీసు నగరాల్లో ఈలాంటి నిరసనలు చేపట్టారు.

## పెన్షన్‌లలో కోతలను నిరసిస్తూ, పెన్షన్ హక్కులకోసం

ఏప్రిల్ 28న వేలాదిమంది వ్యవసాయ కార్మికులు 8 గంటలు పనిని నిలుపుదల చేసి సమ్మె చేశారు. ప్రభుత్వం తమ పెన్షన్‌ను రద్దుచేసే ప్రయత్నాన్ని వారు నిరసించారు. తమ సంక్షేమ చర్యలను రద్దుచేయ బూనుకోవటాన్ని వారు వ్యతిరేకించారు. ఇటీవల కాలంలో వ్యవసాయ కార్మికులు సమైక్యంగా సమ్మె చేయటం ఇదే తొలిసారి. రోమ్, నేపుల్స్, క్యాంపానియా, బెయిన్, పుగ్లియా, పెరుగియా, ఉంబ్రియాలలో వ్యవసాయ కార్మికులు నిరసనాందోళనలు నిర్వహించారు.

### కెనడా

మే 29న, కెనడా పసిఫిక్ రైల్వేలకు చెందిన కార్మికులు తమ పెన్షన్లలో కోతలను, పని ప్రదేశంలో విధిస్తున్న దుర్మార్గ నియమ నిబంధనలను వ్యతిరేకిస్తూ సమ్మె చేపట్టారు.

మే 10న, 4 లక్షలమందికి పైగా ప్రభుత్వ, ప్రైవేటురంగ కార్మికులు-బ్రిటన్‌లో సార్వత్రిక సమ్మె నిర్వహించి పెన్షన్ల విధానంలో ప్రభుత్వం చేపట్టనున్న మార్పులను వ్యతిరేకించారు. 37 వేలమంది పోలీసు అధికారులు ఈ సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. పెన్షను విధానాల నియంత్రణల పేరిట చేపట్టే ప్రభుత్వ చర్యలను వారు తీవ్రంగా వ్యతిరేకించారు. పదవీ విరమణ వయస్సును 68 సం॥లకు పెంచే ప్రభుత్వ ప్రతిపాదనను వారు తీవ్రంగా వ్యతిరేకించారు.

### బ్రిటన్

జూన్ 22న, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు బ్రిటన్‌లో ప్రభుత్వ పెన్షను విధానాన్ని నిరసిస్తూ సమ్మె చేపట్టారు. 12.5 లక్షలమంది రోగులకు ముందస్తుగా ఇచ్చిన ముందస్తు అనుమతులు ఈ సమ్మె కారణంగా రద్దయ్యాయి. 30వేల శస్త్ర చికిత్సలు ఆగిపోయాయి. 40 సంవత్సరాల కాలంలో డాక్టర్లు ఈ విధంగా సమ్మె నిర్వహించటం ఇదే తొలిసారి. 68 సం॥లకు పదవీ విరమణ కాల పరిమితిని పెంచటాన్ని కూడా వ్యతిరేకిస్తున్నారు. ✡

## పెటీబూర్జువా... (3వ పేజీ తరువాయి)

రద్దు తర్వాత అధిక దిగుబడినిచ్చే భూస్వాముల ఎస్టేట్లను తక్కువ దిగుబడినిచ్చే రైతాంగ భూములనుండి వేరు చేయటం (ఎస్టేట్లను కమ్యూనులుగా మార్చటం సోషలిస్టు విప్లవకారుల కార్యక్రమం-అను) వెనకడుగు కాబోదా?

రష్యాలోని ఈనాటి భూస్వామ్య ఆర్థికవ్యవస్థ పెట్టుబడిదారీ విధానపు, అర్ధబానిస రైతు విధానపు రెంటి లక్షణాలను కలిపి వుంచింది. భౌతికంగా, భూస్వాములపై రైతాంగం సాగిస్తున్న పోరాటం అర్ధబానిస వ్యవస్థ అవశేషాలపై సాగిస్తున్న పోరాటం. అయితే ప్రతి సందర్భాన్నీ, ప్రతికేసునూ తీసుకుని ఒక కొలమానంపై పెట్టి, అర్ధబానిసత్వం ఎక్కడ అంతమైందో, పెట్టుబడిదారీ విధానం ఎక్కడమొదలైందో కొలవటం మొదలు పెడితే, మీ పాండిత్య ప్రకర్షను మార్క్సిజానికి అంటగట్టడ మౌతుంది. మనం కొట్లోకొన్న పచారీ సరుకులో శ్రమ విలువ భాగమెంతో, మోసంతో పొందేదెంతో లెక్క వేయలేము. అందువల్ల శ్రమ విలువ సిద్ధాంతానికే నీళ్ళొదులుకుందామా?

సమకాలీన భూస్వామ్య విధానం పెట్టుబడిదారీ, అర్ధబానిస లక్షణాలు రెంటినీ కలిగివుంది. ప్రతి అంశాన్నీ లెక్కించి, దానిబరువు తూచి దానిని ఒక సామాజిక రకంలోకి దూర్చాలని పాండిత్య ప్రకర్షకులు మాత్రమే ప్రకటించగలరు. రెండు సామాజిక యుద్ధాల మధ్య తేడాను "చూడనవసరం" లేదని ఊహాలోక విహారులు మాత్రమే నిర్ధారించగలరు. నిజానికి ఇక్కడ చేయగలిగిన వాస్తవిక నిర్ధారణ ఏమంటే, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా సాగే సాధారణ ప్రజాస్వామిక (రైతాంగ) పోరాటంతో పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గ పోరాటాన్ని జతకలపటం మనకార్యక్రమం, ఎత్తుగడలు రెంటిలోనూ వుండాలి.

నేటి అర్ధభూస్వామ్య ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ విధానలక్షణాలు ఎంతగా పెరిగితే అంతగా గ్రామీణ శ్రామికులను ప్రత్యేకంగా నిర్మాణయుతులను చేయటం ఆవశ్యకమవుతుంది. ఎందుకంటే భూముల స్వాధీనం తర్వాత పెట్టుబడి -కార్మికులమధ్య వైరుధ్యం త్వరగా ముందుకొచ్చి నిలదొక్కుకునేందుకు ఇది దోహద పడుతుంది. భూస్వామ్య ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ లక్షణాలు ఎంతగా పెరిగితే, ప్రజాస్వామిక భూస్వాముల స్వాధీనం అంత త్వరగానూ సోషలిజం కొరకు సాగే నిజమైన పోరాటానికి ప్రోత్సాహకంగా వుంటుంది. తత్పర్యవసానంగా, భూమి "సామాజీకరణ" ద్వారా ప్రజాస్వామిక విప్లవాన్ని తెస్తామనే అబద్ధపు ఆదర్శవాదానికి అంతగా ప్రమాదకరమౌతుంది. నేటి భూస్వామ్య విధానంలో పెట్టుబడిదారీ, అర్ధబానిస సంబంధాలు కలగలిసి వున్నాయన్న వాస్తవాన్నుండి చేయగల నిర్ధారణ ఇదే.

కనుక మనం శుద్ధ కార్మికవర్గ పోరాటాన్ని రైతాంగ పోరాటంతో జతకలపాలి. కానీ రెంటినీ గందరగోళ పరచరాదు. మనం సాధారణ ప్రజాస్వామిక, సాధారణ రైతాంగ పోరాటానికి మద్దతునివ్వాలి. కానీ ఈ వర్గరహిత పోరాటంలో మునిగిపోరాదు. "సామాజీకీకరణ" వంటి నినాదాలతో దీనినెప్పుడు ఆదర్శకరంగా చూపకూడదు. పూర్తిగా స్వతంత్ర వర్గ పార్టీ అయిన సోషల్ డెమొక్రసీలోకి పట్టణ, గ్రామీణ శ్రామికుల నిరువురునీ సమీకరించాల్సిన ఆవశ్యకతను మరచిపోరాదు. నిశ్చయాత్మక ప్రజాస్వామికానికి పూర్తిమద్దతునిస్తున్నప్పుడు, కమ్యూను ఉత్పత్తి ద్వారా "సమానత్వ" సాధన ప్రతీప కలల ప్రయోగాలతో విప్లవ పంథానుండి వైదొలగటాన్ని పార్టీ అనుమతించరాదు. భూస్వాములపై రైతాంగ పోరాటం ఇప్పుడు విప్లవకర పోరాటం, ప్రస్తుత రాజకీయ, ఆర్థిక మార్పు దశలో భూస్వాముల ఎస్టేట్ల స్వాధీనం అన్ని అంశాలలోనూ విప్లవకరమైనది. ఈ ప్రజాస్వామిక విప్లవకర చర్యను మనం సమర్థించాలి. అయితే ఇప్పుడు "సామాజీకీకరణ" చర్యకు పిలుపునివ్వటమూ, సరుకుల ఉత్పత్తి వ్యవస్థలోనే భూమిలో "సమానత్వ" అవకాశాల గురించి చెప్పటమూ ఆత్మవంచనా ప్రజావంచనా అవుతుంది. ఇది అభివృద్ధి నిరోధక పెటీబూర్జువా ఊహాజనిత లోకంగానే వుంటుంది. దానిని ఆ సోషలిస్టు అభివృద్ధి నిరోధకులకే వదలివేద్దాము.

**(సంకలిత రచనలు, సంపుటి 9, పేజీ 434-46)** ✡

## రద్దుచేసిన వెలగవలస బస్సును తిరిగి నడపాలని ధర్నా

**పార్వతీపురం, 24-9-12 :**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో సుమారు 20 గ్రామాలకు చెందిన రెండువందలమంది గిరిజన, గిరిజనేతరులు-సంఘ కార్యాలయం నుండి ఎర్రజెండాలు చేబూని పార్వతీపురం ఆర్‌టిసి డిపో మేనేజరు కార్యాలయం వరకు ప్రదర్శనగా వచ్చి, ధర్నా నిర్వహించారు.

వెలగవలస ఆర్‌టీసి బస్సును రద్దు చేయటం వలన సంవత్సర కాలం నుండి 20 గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, గర్భిణీస్త్రీలు, అత్యవసర వైద్యసహాయం అందవలసినవారు, చాలా హెచ్చుధరను చెల్లించి ఆటోలలో ప్రయాణం చేయవలసివస్తున్నది. ఈ విషయమై పలుమార్లు ఆర్‌టిసి అధికార్ల దృష్టికి తెచ్చినా, పట్టించుకోకుండా... మిన్నకుండటంపట్ల ప్రజలు తీవ్రఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. దీనిపై పార్వతీపురం ఆర్‌టిసి డిపో మేనేజరును నిలదీశారు. 15 రోజుల కాలవ్యవధిలో బస్సును పునరుద్ధరిస్తామని డిపోమేనేజరు హామీ ఇవ్వటంతో ప్రజలు ఆందోళన విరమించారు. 4-6-8 లైన్ల రహదారులతో మహా నగరాలను కలుపుతూ ప్రయాణసౌకర్యాలను అత్యంత సులభతరం, వేగవంతం చేస్తున్నామంటున్న పాలకులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వుండే ముఖ్యంగా ఏజన్సీ ప్రాంతాలలోని అరాకొరా బస్సు సౌకర్యాలపట్ల ప్రదర్శించే నిర్లక్ష్యాన్ని సంఘం నేతలు తీవ్రంగా విమర్శించారు. హామీని నిలుపుకోకుంటే ఆందోళనను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ, సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్స్ బి. నరసింగరావు, ఎం భాస్కరరావు నాయకత్వం వహించారు. ✡


Read ! Subscribe!!




English Organ of
Central Committee of CPI (ML)

Read ! Subscribe!!




Hindi Organ of
Central Committee of CPI (ML)

# 'ఎస్‌టిఎమ్ కంపెనీ భూములను ఆదివాసీ, పేద ప్రజానీకానికి పంచాలి'

**పార్వతీపురం, 24-9-12 :**

పార్వతీపురం మండలం సంగంవలస పంచాయితీ పరిధిలోని 214 ఎకరాల భూములను 1994 సం॥లో ఎస్‌టిఎమ్ కంపెనీ పేరుతో టేకు ప్లాంటేషన్ వేసిన విషయం, వాటాదారుల నుండి లక్షలాదిరూ॥ దండుకొని, వారిని మోసంజేసి కంపెనీ యాజమాన్యం బోర్డుతిప్పేసిన విషయమూ విదితమే.

గతంలో దళారులు కొందరు టేకు చెట్లను నరికి, అమ్ముకునే ప్రయత్నం చేయగా దీనిని రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) నాయకత్వంలో ప్రజలు అడ్డుకున్నారు. కాగా, ఇప్పుడు మరోమారు లబ్ధిదారుల పేరుతో టేకుప్లాంటేషన్‌ను ఆక్రమించేందుకు దళారులు మరో ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు పార్వతీపురం ఆర్‌డిఓ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించి, ఈ దళారులపై తగు చర్యలు తీసుకోవలసిందిగా ఆర్‌డిఓను డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ మాట్లాడుతూ ఆనాడు ఎస్‌టిఎమ్ కంపెనీ, గెడ్డలను, ఫారెస్టు బంజర్లను సైతం ఆక్రమించుకున్నదని, వీటన్నిటిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కా॥ బొత్స నరసింగరావు మాట్లాడుతూ మోసపోయిన వాస్తవికమైన వాటాదారులకు నష్టపరిహారం ఇప్పించాలని, ఎస్‌టిఎమ్ కంపెనీ భూములను సంగంవలస పంచాయితీ పేదలందరికీ పంచాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఇంకా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ ఎమ్. భాస్కరరావు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ✡

# 'క్వారీ ప్రేలుడులో కార్మికుని మృతికి కారకులైన యాజమాన్యాన్ని శిక్షించాలి'

## రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) డిమాండ్

**సైదాపురం, 15-10-12 :**

నెల్లూరుజిల్లా-పులిగిలపాడువద్ద 13-10-12 రాత్రిపూట జరిగిన క్వారీ పేలుడులో సైదాపురం మండలం, మర్లపూడి గ్రామానికి చెందిన మోపూరు మస్తానయ్య అనే కార్మికుడు మరణించాడు. ఈ సంఘటనపై పూర్వాపరాలను విచారించేందుకు కామ్రేడ్స్ జి. సునీత, ఆర్. సుబ్బరాయుడు, వి.వి.రమణయ్యల నేతృత్వంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా బృందం క్వారీ పరిసరప్రాంతంలోని ప్రజల వద్దకు, మర్లపూడి గ్రామస్థుల వద్దకు వెళ్ళి వివరాలు సేకరించింది.

కంకర క్వారీ పేల్చేటప్పుడు పాటించాల్సిన నియమ నిబంధనలను క్వారీ యాజమాన్యం పాటించక పోవటం వలననే ఈ ప్రమాదం జరిగిందని స్పష్టమైంది. ప్రేలుడుకు నిపుణులైన పని వారిని వినియోగించకుండా, తమవద్ద చౌకకూలీగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులనే ఉపయోగిస్తున్నారు. లాభాలను పిండుకోవడం మినహా ఎస్‌ఎల్‌వి క్రషర్, క్వారీ యాజమాన్యానికి కార్మికుల భద్రత గానీ, పరిసర గ్రామాలప్రజల క్షేమంగానీ పట్టలేదని వెల్లడైంది.

**డిమాండ్స్:**

1. కాంట్రాక్టు కార్మికుడైన, గిరిజనుడైన మోపూరు మస్తానయ్య కుటుంబానికి ఐదులక్షల రూ॥ పరిహారాన్ని వెంటనే అందించాలి.
2. ప్రమాదానికి బాధ్యులైన క్వారీ యజమానుల్ని, ప్రమాదానంతరం శవాన్ని గుట్టుచప్పుడుకాకుండా మాయంజేయజూసిన వారి అనుచర గణాన్ని కఠినంగా శిక్షించాలి.
3. క్వారీ పేలుడుకు నిపుణులైన సర్టిఫైడ్ బ్లాస్టర్‌ను గానీ, మేటినినిగానీ వినియోగించటం ద్వారా భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.
4. స్లోబ్లాస్టింగ్ విధానంలో కాకుండా, హైపవర్ బ్లాస్టింగ్ విధానం ద్వారా ఎస్‌విఎల్ క్వారీ, క్రషర్ యాజమాన్యం ప్రేలుళ్ళు సాగిస్తూండటంతో పెద్దపెద్ద రాళ్ళు ఎగిరివచ్చి పరిసరగ్రామాలపై పడుతున్నాయి. గనుక బ్లాస్టింగ్‌కు నిర్ణీత వేళలను పాటించటంతో పాటుగా హైపవర్ బ్లాస్టింగ్‌ను వెంటనే నిలిపివేయాలి. ✡

# సెంటినీ బయోప్రొడక్ట్సు(మద్యం)ఫ్యాక్టరీ బాధితుల ధర్నా



సబ్‌కలెక్టరు కార్యాలయంవద్ద బాధితులతో కలిసి ధర్నా

**విజయవాడ, 22-10-12:**

కృష్ణాజిల్లా-కంచికచర్ల మండలం, గుండేపల్లిలోని సెంటినీ బయోప్రొడక్ట్సు(మద్యం)ఫ్యాక్టరీని, నిబంధనలకు విరుద్ధంగా 2008 నుంచి నిర్వహించటంతో- ఫ్యాక్టరీనుంచి వెలువడే వ్యర్థకాలుష్య జలాలతో చుట్టుప్రక్కల దాదాపు 70 ఎకరాలకు పైగా భూములు గత 5 సం॥ నుంచి నిండిపోవటంతో సాగుకు పనికిరాకుండాపోయాయి. అలాగే ఫ్యాక్టరీనుంచి వెలువడే కాలుష్య వాయువులకు గ్రామంలో అనేకమంది తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధులతో జబ్బునపడి, ఆందోళన చెంది జిల్లా కలెక్టర్‌కు అనేకసార్లు విజ్ఞప్తిచేసిన నేపథ్యంలో 22-10-12న విజయవాడ ఆర్‌డిఓ చర్చలకోసం బాధిత రైతాంగాన్ని, ప్రజల్ని, కంపెనీ ప్రతినిధులను ఆహ్వానించారు. గుండేపల్లి నుంచి బాధితులు ఉ॥ 10గం॥ కల్లా ఆర్‌డిఓ ఆఫీసుకు చేరుకున్నారు. కానీ ఆ సమయానికి ఆర్‌డిఓగారు వేరొక మీటింగ్‌లో ఉన్నానంటూ 15 రోజులదాకా కుదరదని, నవంబరు 5వ తేదీన చర్చలకు రమ్మని ఏఓ ద్వారా బాధితులకు సమాచారాన్ని పంపాడు. దీనితో ఆగ్రహంచెందిన గుండేపల్లి బాధితులు వెంటనే సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ప్రభుత్వాధికారుల నిర్లక్ష్య ధోరణిపట్ల తమ తీవ్ర నిరసనను వ్యక్తంచేశారు..

ఈ ధర్నా సందర్భంగా భాదితులనుద్దేశించి రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ-జీరో పొల్యూషన్ వ్యవస్థ అని ప్రకటించిన సెంటినీ ఫ్యాక్టరీ యాజమాన్యం ఈనాటి వరకు దాన్ని అమలు చేయలేదని అన్నారు. 2008లో ఒకసారి ఆందోళన చేసిన సందర్భంగా ఆనాటి సబ్‌కలెక్టర్ సమక్షంలో జరిగిన చర్చలలో కాలుష్యాన్ని నియంత్రిస్తామని, వ్యర్ధకాలుష్య జలాలు రానీయకుండా చూస్తామని ప్రకటించిన యాజమాన్యం-తన హామీని చెత్తబుట్టలో వేసి తనకు ఎదురులేదన్నట్లు విర్రవీగుతోందని అన్నారు. సమస్య జటిలంగా వుండగా, ఆర్‌డిఓ చర్చలకు పిలిచి 15 రోజులు వాయిదా వేయటాన్ని తీవ్రంగా నిరసించారు. దీర్ఘకాలిక ఆందోళనకు సిద్ధంకావాలని బాధితులకు పిలుపునిచ్చారు.

బాధిత గండేపల్లి రైతు మట్టా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ-రెవిన్యూ, పొల్యూషన్ అధికారులకు 5 సం॥ల నుంచి చెపుతున్నప్పటికీ పట్టించుకోకపోవటం అంటే తాము గ్రామం విడిచి వెళ్లిపోవాలని అధికారుల ఉద్దేశ్యమా? అని ప్రశ్నించారు. గ్రామంలో నెలకు 10మందికిపైగా ప్రజలు చనిపోతున్నారని అన్నారు.

మరో గండేపల్లి బాధితుడు బొక్కా వెంకట్రావు మాట్లాడుతూ-తనకు లాగానే గ్రామంలో ప్రతి ఇంటిలో కనీసం ఇద్దరు ముగ్గురు చొప్పున ఊపిరితిత్తుల వ్యాధులతో బాధలను అనుభవిస్తున్నారని, 60-70 వేల రూపాయలు ఖర్చుపెట్టి వైద్యంచేసినా ఇంకా ఆయాసం, దగ్గుతగ్గలేదని ఫ్యాక్టరీ కాలుష్యంవల్ల గ్రామంలోని వాతావరణం అంతా విషతుల్యం అయిందని డాక్టర్లు కూడా రిపోర్టులు ఇచ్చారని అన్నారు. నవంబరు 5 చర్చలు తర్వాతనైనా అధికారులు సెంటినీ ఫ్యాక్టరీపై చట్టపరమైన చర్యలు తీసుకొని మూసివేయకపోతే బాధిత ప్రజలే ఆ కార్యక్రమాన్ని చేపడతారని అన్నారు.

ధర్నా అనంతరం ఏఓకు మెమోరాండం ఇచ్చారు. ఈ ధర్నాలో రైతుసంఘాల సమాఖ్య నాయకులు వేణుగోపాలరావు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా సహాయ కార్యదర్శి యు.వీరబాబు, జిల్లా నాయకులు ఎం.రాంబాబు, గండేపల్లి రైతు తేళ్ళ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ✡

**గుంటూరు జిల్లా...** (చివరి పేజీ నుండి)

ఉద్యమ జీవితం అంటే ఆశ్చర్యం కలుగుతుంది. ప్రజాతంత్ర ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయే బాధ్యత వహిస్తూనే, ప్రజాతంత్ర ఉద్యమానికి చేదోడువాదోడుగా ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమంలో బాధ్యత వహిస్తూ క్రమశిక్షణగల సైనికునిగా చివరివరకు సాగారు. ఆహారం, జీవన విధానంలో కూడా చాలా జాగ్రత్తగా, మితంగా ఉండేవారు. స్ఫూర్తి దాయకమైన ఉద్యమ జీవితాన్ని గడిపిన సీతారామయ్య గారికి ఒపిడిఆర్ తరఫున జోహార్లు' అంటూ ముగించారు.

కా॥ వై. నేతాంజనేయ ప్రసాద్ (ఏపిటిఎఫ్) మాట్లాడుతూ 'సమాజంలో రెండు రకాల మనుషులు వుంటారు-సమాజాన్ని పూర్తిగా మార్చివేసి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించేలా చూడాలనుకొని సర్వం త్యాగం చేసేవారు; రెండవరకం-సమాజాన్ని ఇలానే వుంచి తమ ప్రయోజనాలు నెరవేర్చుకునేవారు. మొదటి కోవకు చెందినవారు సీతారామయ్యగారు. ఉపాధ్యాయ వృత్తిని త్యాగం చేసి కమ్యూనిస్టుగా ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన కా॥ సీతారామయ్య గారు ఉపాధ్యాయలోకానికి ఆదర్శం' అన్నారు.

ఓపిడిఆర్ గౌరవాధ్యక్షులు కా॥ టి.ఎల్. నారాయణ మాట్లాడుతూ 'బెనారస్‌లో ఎంఎస్‌సి చదివేకాలంలోనూ -తెనాలిలో ఉన్నపుడు హేతువాద ఉద్యమంలో వున్నపుడు మార్క్సిస్టు రాజకీయాలు అర్థంకాలేదు. నగరం కళాశాలకు వచ్చిన తర్వాత ప్రజా ఉద్యమాలతో అనుబంధం ఏర్పడిన తర్వాత మాత్రమే మార్క్సిస్టు సిద్ధాంతం అర్ధంకావటం ప్రారంభమైంది. ప్రజలతో, ప్రజాఉద్యమాలతో సంబంధం లేకపోతే ఎంతటి మేధావికి అయినా మార్క్సిజం అర్ధంకాదు. 1947 నుండి కా॥ సీతారామయ్యగారితో పరిచయంఉంది. నిజనిర్ధారణ కమిటీల సందర్భంగా మండేవారిపాలెం, కనగాల, రాజోలు, వగైరా ప్రాంతాలు తిరిగాం. ఆక్రమంలో సీతారామయ్యగారి జీవన విధానాన్ని పరిశీలించే అవకాశం కలిగింది. ప్రభుత్వాన్ని, పాలకులను ప్రశ్నించే ఆలోచన కలిగివుండటమే ప్రమాదమనే రోజులవి. ఆరోజులన్నింటిలోనూ ప్రజలకు పనికొచ్చే సిద్ధాంతాన్ని నమ్ముకొని ఈ రోజువరకు నిలిచారు సీతారామయ్యగారు. వారి పిల్లల్నికూడా కమ్యూనిస్టు రాజకీయాలవైపు తీసుకొచ్చారు. వీరు మాకు స్ఫూర్తి' అని నివాళు లర్పించారు.

సి. భాస్కరరావు (ఓపిడిఆర్) మాట్లాడుతూ 1980-81 నుండి సీతారామయ్యగారితో పరిచయం వుందన్నారు. 'ఒక సందర్భంలో 'మీ ఇల్లు కాలవకు అవతల ఉందేమిటి' అని ఆయనను ప్రశ్నించినపుడు దళితుల పక్షాన, వ్యవసాయ కూలీల పక్షాన నిలిచి నందుకు ఊరిలో వాళ్ళు వెలి ప్రయోగించారని, దానితో అక్కడ ఇల్లు నిర్మించుకొని వున్నారని తెలిసింది. సీతారామయ్య, ముత్తిరెడ్డి గారి లాంటి వారు ఎప్పుడూ ఆదర్శవంతంగావుంటారు. సమాజంలో నూతన శక్తులు ఎపుడూ ముందుకు వస్తాయి. ఈ ఆశతోనే సమాజంలో ఉందాం, ఉద్యమంలో ముందుకు సాగుదామ'న్నారు.

కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు (రైతుకూలీసంఘం) మాట్లాడుతూ సీతారామయ్యగారు 2008వరకు ఏ కార్యక్రమానికి కబురు పెట్టినా తక్షణం వచ్చి హాజరయ్యే వారని, చిన్నవయసు కామ్రేడ్స్‌తో కూడా చాలా గౌరవంగా వ్యవహరించేవారని, వాన్‌పిక్ సమస్య సందర్భంలోనూ, 2005 వరద ముంపు సందర్భంగా రేపల్లె ఏరియాలో తమతో కలిసి చురుగ్గా పాల్గొన్నారని, కార్యకర్తల పట్ల మంచి అభిమానంతో వ్యవహరించే వారని, 96 సం॥ల వయసులో కూడా యువకుడిలా ఉత్సాహంతో ప్రోత్సహించేవారని పేర్కొన్నారు.

శ్రీధర్ (మండేవారిపాలెం) మాట్లాడుతూ '1917కు ప్రాముఖ్యతవుంది. రష్యాలో విప్లవం విజయవంత మయినది, సీతారామయ్యగారు జన్మించినదీ అదే సంవత్సరం. సీతారామయ్యగారి గొప్పతనం మీరు చూశారు. ఆయన శ్రమ, త్యాగం ఫలాలు, ఫలితాలు మేం తిన్నాం. ఆనాటి పెద్దలు మా చిన్నతనంలో నాజర్ బుర్రకథలోని పాటలన్నీ మాచేత పాడించేవారు. మాకు 10 సం॥ల వయసులో సీతారామయ్యగారు ఎలా ఉన్నారో 50 సం॥ల వయసులోకూడా అలానే వున్నారు. ఆయన నిజాయితీగల వ్యక్తి, మాలిన్యం లేని వ్యక్తి. అందుకే ఆయన అలా స్వచ్ఛంగా ఉన్నారు. గూడవల్లిలో మాకు కొంతభూమి, స్కూలు, జీవనోపాధి ఏర్పడటానికి కృషిచేశారు. మండే పిచ్చయ్య, ఎద్దుదానియేలు, సీతారామయ్యగారు దళితులకు అండదండగా వుండి స్వేచ్ఛని, అక్షరజ్ఞానాన్ని అందించిన గొప్పవారు' అని పేర్కొన్నారు.

జనసాహితి రాష్ట్రప్రధానకార్యదర్శి కా॥ దివికుమార్ మాట్లాడుతూ గూడవల్లిలో సీతారామయ్యగారి కృషితో ఏర్పాటయిన పాఠశాలలో 6 సం॥లు విద్యనభ్యసించానన్నారు. 'గూడవల్లిలో పెద్ద గ్రంథాలయం ఉండేది. ఆనాటి గ్రంథాలయోద్యమ ప్రభావంతో ఏర్పడిన ఈగ్రంథాలయం నుండి ఎన్నో పుస్తకాలు తీసుకొని చదివేవారం. 1992లో చెరుకుపల్లిలో 'డంకెల్ ప్రతిపాదనలు-గాట్ ఒప్పందాల'పై సభ కా॥ సీతారామయ్య అధ్యక్షతన నిర్వహించాం. ఆ సభలో అప్పులభారతం నాటకం వేశాము. అనంతరం విరాళాల సేకరణకు ఇంటింటికి తిరిగినపుడు సీతారామయ్యగారు మాతో కలిసి ఆ వయసులో కూడా ఉత్సాహంగా తిరిగారు' అని గుర్తు చేసుకున్నారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥ భార్గవశ్రీ మాట్లాడుతూ 'తెలంగాణా రైతాంగసాయుధ పోరాటం ముందుకు సాగటానికి కృష్ణా, గుంటూరు జిల్లాలు వెన్నుదన్నుగా నిలిచాయి. కార్యకర్తలు, ఆయుధాలు, రాజకీయ శిక్షణ, విరాళాలు అందించేవి. ఆ ఉద్యమ నేపథ్యంలో అభివృద్ధి చెందినవారే కా॥ ఘంటా సీతారామయ్యగారు. సీనియర్ కమ్యూనిస్టులు ఈనాటి పరిస్థితుల్ని చూసి వ్యధపడుతున్నారు. కమ్యూనిస్టు, విప్లవశక్తులు ఒక వేదిక మీదకు రావాలి. ప్రజలకు విశ్వాసం కలిగించాలి' అని పేర్కొన్నారు.

అడ్వకేటు డి. పాపారావు మాట్లాడుతూ సీతారామయ్యగారు 1993లో నిజ నిర్ధారణ కమిటీలో ఒపిడిఆర్ తరఫున పాల్గొంటున్న నేపథ్యంలో తమ పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు. 1990లో తుఫాను సందర్భంగా కనగాలలో డబ్బుల పంపిణీ సందర్భంలో తలెత్తిన వివాదం-పోలీసులదాడి నేపథ్యంలో ప్రజలపక్షాన సీతారామయ్యగారు నిర్వహించిన పాత్ర గొప్పదని గుర్తుచేశారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥ గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ 'కమ్యూనిస్టు ఉద్యమం రెండు సమస్యలతో తీవ్రంగా వేదనకు గురవుతోంది. పార్లమెంటరీయిజం-రెండోది పార్లమెంటు, ప్రజల పోరాటాలు, ఆందోళనలు అవసరంలేదు; 10 మందో 100 మందో ఆయుధాలు పట్టుకొని బయలుదేరితే విప్లవం వచ్చేస్తుంది అనేవాదనలు. 1967 నగ్జల్బరీ పోరాటం తర్వాత ఈ సమస్య కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింతగా వేధిస్తున్నది. ప్రజల పోరాటం-ప్రజలు ఆయుధాలు పట్టిన పోరాటం నగ్జల్బరీ. కమ్యూనిస్టులు ఆయుధాలు పడితే చాలన్న వాదన 1967 తర్వాత కమ్యూనిస్టు ఉద్యమాన్ని వేదనకు గురిచేస్తున్నది. కమ్యూనిస్టులు సమాజంలో అన్ని చెడులకు వ్యతిరేకంగా బహుముఖీన కార్యక్రమాలు చేపట్టాలి. సీతారామయ్యగారు జీవితంలో ఏ కష్టాలకు, నిర్బంధాలకు వెరవలేదు, వెనక్కితగ్గలేదు. కమ్యూనిస్టులు సాధించిందేమిటో సమాజానికి చెప్పాలి. నెహ్రూనో, ఎన్టీఆరో, చంద్రబాబో, వైయస్సారో మరొకరో సాధించదేమీలేదు. పదవిలోవుండి కోట్లు సంపాదించుకోవడం తప్ప! ప్రజలకు ఏమైనా సాధించడానికి పోరాడింది కమ్యూనిస్టులు, ప్రజాతంత్ర శక్తులే. సమాజంలో చెడులు పెరిగాయి. అన్ని పార్టీల్లో శ్రమశక్తి దోపిడీ, సంపదల దోపిడీకి వ్యతిరేకంగా మనం పోరాడాలి. కమ్యూనిస్టు ఉద్యమంలో సిపిఐతో, సిపిఎంతో రాజకీయంగా విభేదిస్తున్నాం. అయితే దానికి ముందు కాలం ఒకటివుంది. సుందరయ్య, రాజేశ్వరరావు, ఎల్‌బిజి, మాకినేని, వేములపల్లి, కొరటాల వంటి వారందరూ ప్రజల మధ్య పనిచేశారు, ప్రజల్ని చైతన్యం చేశారు. అనాటి వారందరి కార్యాచరణ మనకు స్ఫూర్తినిస్తుంది. వ్యవస్థ మారకుండా ఫలితాలు రావు. సంఘర్షణ ద్వారానే ఫలితాలు సాధించగలం, సీతారామయ్యగారిని, అనేకమంది అమరుల జీవితాల నుంచి సంఘర్షణను స్ఫూర్తిగా తీసుకుంటూ ముందుకు సాగిపోదాం' అని పిలుపునిచ్చారు.

సభావేదికపై కా॥ ఘంటా సీతారామయ్యగారి పెద్ద కుమారుడు డా॥భాస్కరరావు; చిన్న కుమారుడు, టి.ఎన్.మెమోరియల్ ట్రస్టు సభ్యులు అయిన డా॥వెంకట్రావు చివరిదాకా వుండి నివాళులర్పించారు. జనశక్తి పత్రిక సంపాదకులు డా॥జస్వంతరావు, ఎఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥వై.సోనీ; మరియు వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సీనియర్ కామ్రేడ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ✡

## ప్రజలపై పెనుభారాలకు వ్యతిరేకంగా ఆందోళన


కలెక్టరు కార్యాలయంవద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న కా॥కోటయ్య

**నిజామాబాద్, 16-10-12 :**

రెండవదశ సంస్కరణలు పేర పాలకులు మోపుతున్న పెనుభారాలు, దోపిడీలకు నిరసనగా; పెంచిన ఎరువులు, పెట్రోలు, డీజిల్ ధరలన్నింటినీ తగ్గించాలని రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా నిర్వహించారు.

దాదాపు 200 మందితో యండిఓ ఆఫీసునుంచి కలెక్టర్ ఆఫీస్ వరకూ ఊరేగింపుగా నినాదాలు ఇస్తూ కలెక్టర్ కార్యాలయంవద్ద ధర్నా చేపట్టారు. ధర్నాలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్రకార్యదర్శి కా॥ కె. కోటయ్య మాట్లాడుతూ అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదం సాగిస్తున్న కుట్రలను రిలయన్స్ వంటి బడాదళారీ కంపెనీల దోపిడీల వల్ల ఏర్పడుతున్న విద్యుత్‌కొరతలను వివరించారు. యుపిఏ ప్రభుత్వం బడాపెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల, భూస్వాముల దోపిడీ ప్రయోజనాలను మరింతగా ముందుకు తీసుకొనిపోవడమే రెండవదశ సంస్కరణల లక్ష్యం అని వివరించి వాటన్నింటికీ వ్యతిరేకంగా పోరాడాలని వివరించారు. నిజామాబాద్ జిల్లా సంఘం కార్యదర్శి కా॥ గంగుల నర్సయ్య మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో పంటలు చేతికి వచ్చేసరికి దళారీలు రేటు తగ్గిస్తున్నారని, అసలే వర్షాభావం వల్ల జిల్లాలో పంట విస్తీర్ణం సగానికి తగ్గి దిగుబడులు కూడా తగ్గుతుంటే మరోపక్క సోయాబీన్‌కు ధరను క్వింటాల్ 3,800 రూ॥ నుంచి 2,600 రూ॥కి పడగొట్టారని, ఇంకా రేట్లు తగ్గించ జూస్తున్నారనీ, అదే విధంగా మక్కల (మొక్కజొన్న) 1800 రూ॥ల నుంచి 1100 రూ॥లు తగ్గించారని, వరికి కూడా గిట్టుబాటుధర దక్కకుండా సేట్లు మోసంచేసే అవకాశం ఉంది. కనుక రైతాంగం గిట్టుబాటు ధరలకోసం పోరాటానికి పిలుపునిచ్చారు. ఆదేవిధంగా నిజామాబాద్‌లో ఇళ్ళస్థలాలకోసం పేదలు అధికారుల చుట్టూ తిరిగి, తిరిగి విధిలేక ప్రభుత్వ బంజర్లలో ఇళ్ళు వేసుకొంటే వాటిని రియల్‌ఎస్టేట్ వాళ్ళకోసం పేదల గుడిసెల తొలిగించే ప్రయత్నం చేస్తున్నదని ప్రభుత్వ ప్రయత్నాలను ఖండిస్తూ మధురనగర్ కెనాల్ కాలనీలో నివాసముంటున్న పేదలకు అక్కడే ఇళ్ళపట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేసారు. ఈ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు ఇచ్చారు. ✡

## పది వామపక్ష పార్టీల సమావేశం నిర్ణయాలు

**హైదరాబాదు, 29-10-12 :**

(హైదరాబాద్‌లోని మాకినేని బసవపున్నయ్య భవన్ (సిపిఎం రాష్ట్రకార్యాలయం)లో సిపిఐ-సిపిఎం-సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసి- ఎంసిపిఐ(యు)-సిపిఐ(ఎం-ఎల్)-ఆర్ఎస్‌పి- ఫార్వర్డ్‌బ్లాక్- ఎస్‌యుసిఐ-సిపిఐ(ఎం-ఎల్) పార్టీల రాష్ట్ర పతినిధులు 29-10-12న సమావేశమై ఈ క్రింది నిర్ణయాలు చేశారు. సిపిఐ (ఎం-ఎల్) లిబరేషన్ ఈ నిర్ణయాలకు తమ ఆమోదం తెలిపింది)

1. రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్తు కొరత, ప్రజలపై ఇంధన సర్దుబాటు ఛార్జీల (ఎఫ్ఎస్ఏ) భారం సమస్యలపై నవంబర్ 10 నుండి డిసెంబర్ 10 వరకూ దిగువస్థాయి వరకూ వెళ్ళి ప్రజలను చైతన్యవంతుల్ని చేయటంలో భాగంగా ప్రచార ఆందోళనా కార్యక్రమాల్ని చేపట్టాలి.
2. బీడీయాజమాన్యాల వత్తిడికి తలొగ్గిన ప్రభుత్వం రాష్ట్రంలోని 7 లక్షలమంది బీడీ కార్మికులు పోరాడి సాధించుకున్న నిర్ణయాలను (జీవో నెం 41) నిలువుదలచేస్తూ జారీ చేసిన జీవో 81ని రద్దుచేయాలి. జీవో నెం. 41ని అమలు చేయాలి.
3. ఇంటి అవసరాలకు 9 వంటగ్యాస్ సిలిండర్లను సబ్సిడీపై అందించాలి. సంక్షేమ హాస్టళ్ళకు, మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సబ్సిడీపై వంటగ్యాస్ సిలిండర్లను అందజేయాలి.
4. వికలాంగుల ఫించనును రు. 2500కు, వృద్ధుల పింఛనును రూ. 2000కు పెంచాలి.
5. చిల్లర వర్తకంతో సహా దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆహ్వానిస్తూ, కేంద్రప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలి. ✡

## పశ్చిమబెంగాల్ | కామ్రేడ్ బహర్ షేక్ హంతకులలో ఇద్దరికి యావజ్జీవ శిక్ష

**కామ్రేడ్** బహర్ షేక్ హత్య జరిగిన 28 నెలల తర్వాత నాడియా జిల్లా కోర్టు ఇద్దరికి యావజ్జీవ శిక్ష విధించింది. మిగిలిన హంతకులను ఇప్పటికీ పట్టుకోలేదు.

కా॥ బహర్ షేక్, సిపిఐ (ఎం-ఎల్) నాడియాజిల్లా కార్యదర్శి; పశ్చిమబెంగాల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు. 2010 మే నెల 10వ తేదీ రాత్రి తన గ్రామానికి తిరిగి వస్తుండగా దుండగులు ఆయనపై దాడి చేసి హత్యకావించారు. హంతకులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఆందోళన సాగిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం యిద్దరిపై కేసు పెట్టి అరెస్టు చేసింది. మిగిలిన హంతకులను గుర్తించి పట్టుకునే ప్రయత్నాలు చెయ్యలేదు.

పిన్నవయుసులోనే కమ్యూనిస్టు రాజకీయాల వైపు ఆకర్షితుడైన కా॥ బహర్ షేక్ విప్లవ రాజకీయాల వైపు వచ్చి కా॥ కానూసన్యాల్ నాయకత్వంలోని ఓ.సి.సి.ఆర్‌లో చేరారు. తన నిస్వార్ధ, నిరంతరాయ కార్యకలాపాలతో మంచి కమ్యూనిస్టుగా రూపొంది ప్రజానాయకుడిగా నాడియాజిల్లా కార్యదర్శిగా ఎదిగారు. ఆయన స్వగ్రామమైన ధనుంజయపూర్‌లో పెత్తందారీ శక్తులు సాగించే సామాజిక అన్యాయాలను ఎదుర్కొన్నారు. దీనితో ఆయనపై కక్ష పెంచుకున్న తృణమూల్ కాంగ్రెస్‌తో సంబంధమున్న పెత్తందారీ శక్తులు కుట్రపన్ని ఆయనను హత్యచేశాయి. ప్రభుత్వం యిద్దరిపై కేసుపెట్టి చేతులు దులుపుకుంది.

మిగిలిన హంతకులనూ, కుట్రదారులనూ అరెస్టు చేయాలని సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది. ఈ మేరకు ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు ప్రచార కార్యక్రమం సాగిస్తున్నది. ✡

## గుంటూరు జిల్లా వృద్ధనాయకులు కా॥ ఘంటా సీతారామయ్యగారి సంస్మరణ సభ

**రేపల్లె, 9-11-12 :**

సిపిఐ (ఎం-ఎల్) నాయకులు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) గుంటూరుజిల్లా గౌరవాధ్యక్షులు కా॥ ఘంటా సీతారామయ్య గారి సంస్మరణసభ 9-11- 2012న రేపల్లె పట్టణంలోని ఎమ్‌సిపి హాలులో జరిగింది. ఈ సభకు సిపిఐ (ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములు అధ్యక్షత వహించారు. తొలుత అందరూ లేచి నిలబడి 2 ని॥లు మౌనం పాటించి, కా॥ సీతారామయ్యగారికి జోహార్లర్పించారు.


సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న కా॥కె.కోటయ్య: హాజరైన ప్రజానీకం

రేపల్లె ప్రాంతంలో-తమ సుదీర్ఘకాల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కా॥ సీతారామయ్యగారి ఆశయాల్ని కొనసాగించేందుకు దీక్ష పూనాలని కా॥ శ్రీరాములుగారు పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. కోటయ్య మాట్లాడుతూ గుంటూరుజిల్లాలోనే పెద్ద వయసు కలిగిన సీనియర్ కమ్యూనిస్టు నాయకుల్లో సీతారామయ్యగారు ఒకరని అన్నారు. '1942 నుండి 2012 వరకు 70 సం॥లపాటు కమ్యూనిస్టుగా, కమ్యూనిస్టు విప్లవకారుడిగా గొప్ప రాజకీయ జీవితాన్ని గడిపారు. క్విట్ ఇండియా ఉద్యమంలో జాతీయ ప్రజాస్వామిక ఆకాంక్షలు కలిగిన శక్తులన్నీ పాల్గొన్నాయి. వారిలో సీతారామయ్యగారు ప్రముఖులు. తెలంగాణా రైతాంగ సాయుధపోరాటకాలంలో కృష్ణ, గుంటూరు, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఉద్యమాలు ఊపందుకున్నాయి. దేశానికే ఒకలైనుని అందించిన ఈ పోరాటక్రమంలో కా॥ సీతారామయ్య వంటివారు, ఆ పోరాటానికి మద్దతుగా, అండదండగా రేపల్లె ప్రాంతంలో కృషి సాగించారు. కమ్యూనిస్టు ఉద్యమానికి అతివాదం చేసిన నష్టం -దీనిని ఎదుర్కోవడానికి సాగిన సిద్ధాంత, రాజకీయ పోరాటం-ఈ ఒరవడిలో నిర్బంధాల్ని, కుట్రకేసుల్ని, అజ్ఞాతవాసాన్ని ఎదుర్కొంటూ రేపల్లె ప్రాంతంలో సీతారామయ్య, ముత్తిరెడ్డి శ్రీరాములు తదితరులు నిలబడి ఉద్యమాన్ని నడిపించారు. మాకన్నా పెద్ద తరంవారుగా ఆదర్శవంతమైన వారుగా, విలువైన జీవితాన్ని గడిపిన కా॥ సీతారామయ్యగారి స్మృతికి జోహార్లర్పిస్తున్నాను. నేడు దేశమంతా విద్యుత్ సంక్షోభం-దేశీయ, చిన్నతరహా పరిశ్రమలు మూతపడే పరిస్థితి, రైతాంగం ఆత్మహత్యలే శరణ్యం అని నెట్టబడుతున్న ఈ పరిస్థితిలో ఐక్య ఉద్యమాలు నిర్మించాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. సీతారామయ్యగారి వంటి అనుభవజ్ఞుల స్ఫూర్తితో ఐక్యఉద్యమాలతో ముందుకు వెళ్ళాల'ని కోరుతూ కా॥ కోటయ్య తన ఉపన్యాసం ముగించారు.

ఆంధ్రప్రదేశ్ రైతుకూలీసంఘం రాష్ట్రనాయకులు కా॥ చల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 'కా॥ సీతారామయ్యగారి నిబద్ధత చాలా గొప్పది-ఆయన అందరికీ స్ఫూర్తి. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం సిద్ధాంతంగా కలిగిన చాలా పార్టీలున్నాయి. మీరంతా ఎందుకు ఐక్యం కారని క్యాడర్ అంతా నాయకత్వాన్ని నిలదీయాలి. అనేక తప్పులు జరిగాయి వాటిని పరిశీలించుకొని ఐక్యంకావాలి' అనికోరారు.

మాజీ ఎంఎల్ఏ శ్రీముమ్మనేని వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ 'దేశంలో ఎక్కడ చూసినా దోపిడీ పెరిగిపోతున్నది. పదవి ఎందుకంటే దోపిడీ చెయ్యడం కోసం అనే పరిస్థితి వచ్చింది. ఉత్తమ పంచాయతీలంటే ఎక్కువ దోచుకున్నవారే అనేది నేటి లెక్క. దానికి భిన్నంగా సీతారామయ్యగారు పంచాయితీకి సేవచేశారు. ప్రజలకు కనీసవసతులు, అవసరాలు తీర్చి ఉత్తమ పంచాయితీగా నిలబెట్టిన ఘనత ఆయనది. ఆయన స్ఫూర్తిగా ప్రజలకు సేవ చేయాల'ని పేర్కొన్నారు.

ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు కా॥ కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ 'కా॥ తరిమెల నాగిరెడ్డిగారు చెప్పే స్పీడ్‌ని, వెంకట సుబ్బయ్యగారు ఎప్పుడూ అంటుండే ఫాస్ట్‌ని అందుకున్న వారిలో కా॥ సీతారామయ్యగారు ఒకరు. నగరం కళాశాలలో పనిచేస్తున్న కాలంలో మేము నిలబడటానికి కామ్రేడ్స్ దొంతు నాగయ్య, సీతారామయ్య, లాజరస్, వెంకటకోటయ్య, ముత్తిరెడ్డి శ్రీరాములు గార్లు చాలా సహాయపడ్డారు. సీతారామయ్యగారిని స్మరించుకుంటున్నా మంటేవారి సుగుణాలేంటో తెలుసుకొని మనం నేర్చుకోవడానికి. మన బలహీనతలేమిటో తెలుసుకొని సరిచేసుకోవడానికి. కమ్యూనిస్టుల గురించి చెడుగా మాట్లాడే వారు కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మి, ఆచరిస్తూ చివరివరకు నిలబడిన సీతారామయ్యగారి వంటి అసంఖ్యాకుల గూర్చి చెప్పరు. మార్క్సిజాన్ని స్వీకరించి, ఇతరులకు మార్క్సిజాన్ని అందించే ప్రయత్నం చేసిన సీతారామయ్యగారు మనందరకు స్ఫూర్తి' అన్నారు.

నల్లమడ రైతు సంఘం నాయకులు డా॥ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ 'చావు ప్రతి ప్రాణికి సహజం. జీవితంలో ప్రజలకోసం నిలబడటం అనేది ఉన్నత మైన విషయం. సీతారామయ్యగారు త్రిపురనేని గారి భావాలతో హేతువాదిగా, తర్వాత మార్క్సిజాన్ని అర్ధం చేసుకొని కమ్యూనిస్టుగా నిలబడ్డారు. రైతు ఉద్యమాల్లో అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఆనాడు 1500 ఎకరాల భూమిని పంచిన ఘనత సీతారామయ్య గారిది, రైతుసంఘాలదే. సమాజం ఏమన్నా బాగా వుండటానికి కారణం సీతారామయ్యగారి వంటి వాళ్లు చేసిన గొప్ప పనులవల్లే. ఆనాడు హరిజనవాడల్లో తిరిగారు, స్కూళ్ళు, హాస్టళ్ళు పెట్టించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికలు చాలావచ్చాయి. అన్నిటికన్నా మూలమైన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అర్థంచేసుకొని, ఆత్మ విమర్శతో కమ్యూనిస్టు పార్టీలు ఐక్యకార్యాచరణకు రావాలి. విద్యుత్తు సమస్య, కే.జీ. బేసిన్ గ్యాస్ దోపిడీ సమస్యల నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీలు ఐక్యకార్యాచరణ సాగించాలి' అని పిలుపు నిచ్చారు.

సిపిఎం జిల్లా కమిటీ తరపున సిపిఎం జువ్వలపాలెం శాఖ సహాయకార్యదర్శి వేములపల్లి వెంకట్రామయ్య కా॥ సీతారామయ్యగారికి జోహార్లర్పిస్తూ సంతాప సభలో సందేశాన్ని అందించారు.

కా॥ వి. హనుమంతరావు మాట్లాడుతూ (ఓపిడిఆర్) 1992లో తాను ఓపిడిఆర్ గుంటూరుజిల్లా కమిటి బాధ్యతలు చేపట్టేనాటికే సీతారామయ్యగారు ఓపిడిఆర్ బాధ్యతల్లో వున్నారని, ఆనాటి నుండీ ఆయనతో సన్నిహిత సంబంధాలున్నాయనీ, 2004 నుండి మరణించే నాటివరకు ఆయన ఓపిడిఆర్ జిల్లా ఉపాధ్యక్షులుగా వున్నారనీ వివరించారు. '70 సం॥ల

**(తరువాయి 7వ పేజీలో**

*Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*
*and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2*
*Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*